తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్
94949 23460

https://epaper.tharangalu.in
జాతీయ దిన ప్రతిక
RNI. TELTEL / 2022 / 83463
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...
హైదరాబాద్
సోమవారం
03 ఆగస్టు 2026
సంపుటి 03
సంచిక 294
పేజీలు 8
వెల రూ.5.00
Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh
Epaper: www.tharangalu.in.com

## ప్రజలు ఎన్నుకున్న విరూపాక్షి ఏమైనా ఉగ్రవాదా?: జగన్



- రాష్ట్రంలో అరాచక పాలన పరాకాష్టకు చేరిందని జగన్ విమర్శ
- ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షిని ఉగ్రవాదిలా అరెస్ట్ చేశారని ఆగ్రహం
- సీదిరి అప్పలరాజు, ముస్తఫాలపై అక్రమ కేసులు బనాయించారని ధ్వజం
- ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చడానికే దాడులు, అరెస్టులని విమర్శ
- ఎన్ని కేసులు పెట్టినా వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేసిన జగన్

అమరావతి, ఆగస్టు 2 తరంగాలు రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని, 'నారాసుర పాలన'లో అరాచకం పరాకాష్ఠకు చేరిందని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దాడి చేసిన అధికార పార్టీ వారికి రక్షణ కల్పిస్తూ, బాధితులైన ప్రతిపక్ష నేతలపైనే హత్యాయత్నం వంటి తీవ్రమైన కేసులు బనాయిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఇది ప్రజాస్వామ్యమా, పోలీస్ రాజ్యమా లేక జంగిల్ రాజ్యమా అని ముఖ్యమంత్రి చంద్రబాబును ఆయన

➤ మిగతా 2వ పేజిలో..

## గోదావరి ఉగ్రరూపం.. ముంపులోనే లంక గ్రామాలు

- గోదావరికి కొనసాగుతున్న వరద ఉధృతి
- కోనసీమ, ఉభయ గోదావరి జిల్లాల్లో ముంపులో లంక గ్రామాలు
- పలు గ్రామాలకు నిలిచిపోయిన బోట్లు, రవాణా సౌకర్యాలు
- ప్రమాదకరంగా ప్రవహిస్తున్న వశిష్ఠ, గౌతమి పాయలు
- అప్రమత్తమైన అధికారులు, కొనసాగుతున్న సహాయక చర్యలు



రాజమండ్రి ఆగస్టు 2తరంగాలు ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. వరద పోటెత్తడంతో కోనసీమ, ఉభయ గోదావరి జిల్లాలు వణికిపోతున్నాయి. స్థానికంగా వర్షాలు తగ్గుముఖం పట్టినా, మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటకల నుంచి భారీగా వస్తున్న వరద నీటితో గోదావరి ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. దీంతో లంక గ్రామాలు నీట మునిగి, ప్రజలు

➤ మిగతా 2వ పేజిలో..

## మార్చిలో ఎమ్మెల్సీ సంగ్రామం

- రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు
- సెప్టెంబరు చివరి వారంలో ఓటరు నమోదు నోటిఫికేషన్!
- 2 స్థానాలనూ దక్కించుకునేలా హస్తం పార్టీ కసరత్తు
- హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్‌పై బీజేపీ గురి
- ఈసారి పోటీకి బీఆర్ఎస్ సిటింగ్ ఎమ్మెల్సీ అనాసక్తి
- 'వరంగల్-నల్లగొండ-ఖమ్మం'లో బరిలోకి కొత్త వ్యక్తి?



హైదరాబాద్, ఆగస్టు 2 తరంగాలు రాష్ట్రంలో మరోసారి ఎన్నికల భేరి మోగనుంది. రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల కు వచ్చే ఏడాది మార్చిలో ఎన్నికలు జరగనున్నాయి. హైదరాబాద్- రంగారెడ్డి- మహబూబ్‌నగర్, వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనుండడంతో ప్రధాన పార్టీలు ఇప్పటి నుంచే సన్నద్ధమవుతున్నాయి. అభ్యర్థుల ఎంపికకు కసరత్తు కూడా మొదలుపెట్టాయి. రాష్ట్రంలో ఉన్న మొత్తం పట్టభద్రుల్లో.. మూడింట రెండొంతులకు పైగా ఈ రెండు శాసనమండలి నియోజకవర్గాల్లోనే ఉన్నారు. దీంతో రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రధాన పార్టీలు సీరియస్‌గా తీసుకున్నాయి. ఈ ఎన్నికల్లో పట్టభద్రుల మద్దతు సాధించి గెలిస్తే.. వచ్చే సార్వత్రిక ఎన్నికలకు అదే పెద్ద సానుకూల అంశంగా మారుతుందని భావిస్తున్నాయి. మొత్తమ్మీద ఆరు ఉమ్మడి జిల్లాల్లో సుమారు 14 లక్షల మంది పట్టభద్రులు తీర్పు ఇచ్చే ఈ ఎన్నికలు.. ప్రధాన పార్టీల మధ్య మినీ మహాసంగ్రామమే కానుందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ ఎన్నికల తీర్పు.. వచ్చే అసెంబ్లీ ఎన్నికలపై కచ్చితంగా ప్రభావం చూపుతుందనీ చెబుతున్నాయి. కాగా, హైదరాబాద్- రంగారెడ్డి-మహబూబ్‌నగర్ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సురభి వాణీదేవి, వరంగల్-ఖమ్మం-నల్లగొండ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న తీన్మార్ మల్లన్న పదవీకాలం వచ్చే ఏడాది మార్చి 27తో ముగియనుంది. దీంతో మార్చి 29 కల్లా ఈ స్థానాల్లో కొత్త ఎమ్మెల్సీలు ఎన్నిక కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభించేందుకు

➤ మిగతా 2వ పేజిలో..

## బోనాలను గతంలో పట్టించుకోలేదు..



- కేసీఆర్ వల్లే బోనాలకు రాష్ట్ర పండుగ హోదా: కేటీఆర్
- సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న కేటీఆర్
- గత ప్రభుత్వాలు బోనాలను గుర్తించలేదని విమర్శ
- కేసీఆర్ పాలనలోనే బోనాలకు రాష్ట్ర పండుగ హోదా వచ్చిందన్న మాజీ మంత్రి
- వర్షాలు బాగా పడి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు వెల్లడి

హైదరాబాద్,ఆగస్ట్2తరంగాలు : సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దర్శించు కున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించు కున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనానంతరం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, కేటీఆర్‌ను

➤ మిగతా 2వ పేజిలో..

## భూమికి ఆధార్ లాంటి 'భూధార్' నంబర్: మంత్రి పొంగులేటి

- గత ప్రభుత్వ హయాంలో జరిగిన ధరణి అక్రమాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్న మంత్రి
- భూ అక్రమ లావాదేవీలపై త్వరలో ఫాస్ట్ ట్రాక్ విచారణ జరుపుతామని వెల్లడి
- ప్రతీ సర్వే నంబర్‌కు ఆధార్ తరహాలో 'భూధార్' నంబర్ కేటాయిస్తామన్న పొంగులేటి
- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నిధుల కొరత ఉండదని హామీ



హైదరాబాద్,ఆగస్ట్2తరంగాలు : గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ వేదికగా జరిగిన భూ అక్రమాలపై ఉక్కుపాదం మోపుతామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి హెచ్చరించారు. పేదల భూములను అక్రమంగా చేజిక్కించుకున్న వారు ఎంతటి వారైనా సరే వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ అక్రమాలపై త్వరలోనే ఫాస్ట్ ట్రాక్ విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.గతంలోని ధరణి వ్యవస్థ నుంచి ప్రస్తుత 'భూ భారతి' వరకు జరిగిన ప్రతి లావాదేవీని క్షుణ్ణంగా పరిశీలిస్తామని మంత్రి వివరించారు. తమ ప్రభుత్వం కొత్తగా ఒక్క అంగుళం భూమిని

➤ మిగతా 2వ పేజిలో..

## లష్కర్ బోనాల్లో సీఎం రేవంత్ రెడ్డి..




- మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు
- సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న సీఎం
- ప్రభుత్వం తరఫున జగన్మాతకు పట్టువస్త్రాలు, బోనం సమర్పణ
- పాల్గొన్న మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీతక్క
- అంగరంగ వైభవంగా జరుగుతున్న లష్కర్ బోనాల జాతర

➤ మిగతా 2వ పేజిలో..

## ఇరాన్‌పై దాడులు ఆపేస్తున్నా

- ఆ దేశంతో శాంతి ఒప్పందం కొలిక్కి వస్తోంది
- మా షరతులకు ఇరాన్ అంగీకరించింది
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన
- క్షిపణులు లోడ్ చేసే ఉన్నాయని అంతలోనే హెచ్చరిక
- నేరుగా యుద్ధం చేసే దమ్ము లేకనే ట్రంప్ మానసిక యుద్ధం: ఇరాన్



వాషింగ్టన్, ఆగస్టు 2తరంగాలు : ఇరాన్‌తో యుద్ధం విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర గందగోళ ప్రకటనలు చేస్తున్నారు. ఇరాన్‌పై దాడులను నిలిపివేస్తున్నట్లు శనివారం రాత్రి ట్రూత్ సోషల్‌లో ఆయన ప్రకటించారు. అంతలోనే ఇరాన్ వైపు దూసుకుపోయేందుకు తమ క్షిపణులు, యుద్ధ విమానాలు లోడ్‌చేసి సిద్ధంగా ఉన్నాయని మరో హెచ్చరిక చేశారు. ఇరాన్‌తో శాంతి ఒప్పందంపై చర్చలు కొలిక్కి వచ్చాయని, అందుకే

➤ మిగతా 2వ పేజిలో..

జాతీయ దిన పత్రిక

# తరంగాలు

THARANGALU DAILY NEWS

సోమవారం, 03 ఆగస్టు, 2026



## బోనాలను గతంలో పట్టించుకోలేదు..

శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, బోనాలు కులాలకు అతీతంగా జరుపుకునే గొప్ప పండుగ అని కొనియాడారు. సమైక్య రాష్ట్రంలో బోనాల పండుగను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని, రాష్ట్ర పండుగగా గుర్తించలేదని విమర్శించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రిగా కేసీఆర్ బోనాలను రాష్ట్ర పండుగగా ప్రకటించారని గుర్తుచేశారు. అమ్మవారి ఆశీస్సులతోనే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని కేసీఆర్ ఎప్పుడూ చెబుతుంటారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి గుడికి రూ.25 కోట్లు కేటాయించి, పండుగలను ఘనంగా నిర్వహించామని తెలిపారు.

రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడిపంటలతో పచ్చగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు కేటీఆర్ చెప్పారు. రైతులందరూ సుఖసంతోషాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## ప్రజలు ఎన్నుకున్న విరూపాక్షి ఏమైనా ఉగ్రవాదా?: జగన్

సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. ఆలూరు బీసీ ఎమ్మెల్యే విరూపాక్షిని అర్ధరాత్రి అరెస్ట్ చేసిన తీరుపై జగన్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. "ప్రజలెన్నుకున్న ఎమ్మెల్యే విరూపాక్షి ఏమైనా ఉగ్రవాదా? అర్ధరాత్రి 2:45 గంటలకు వందలాది పోలీసులతో ఇంటిపై దాడి చేసి, తలుపులు బద్దలుకొట్టి అరెస్ట్ చేయాల్సిన అవసరం ఏమొచ్చింది?" అని జగన్ నిలదీశారు. చిప్పగిరి మండలం నేమకల్లులో టీడీపీ శ్రేణులు తమ పార్టీ నాయకుడి ఇంటిపై దాడి చేయగా, ప్రాణభయంతో ఆ కార్యకర్త ఎమ్మెల్యేకు ఫోన్ చేశాడని జగన్ వివరించారు. బాధితుడికి అండగా నిలబడటానికి వెళ్లిన ఎమ్మెల్యేపైనే టీడీపీ వారు రాళ్లతో దాడి చేశారని, ఈ ఘటనలో ఆయన సోదరుడు గాయపడ్డాడని తెలిపారు. వాస్తవానికి దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాల్సింది పోయి, బాధితుడైన ఎమ్మెల్యేపైనే హత్యాయత్నం కేసు నమోదు చేయడం దారుణమని అన్నారు. అర్ధరాత్రి పోలీసులు జరిపిన దౌర్జన్యం బయటకు రాకూడదనే భయంతోనే ఎమ్మెల్యే ఇంట్లోని సీసీటీవీ హార్డ్‌డిస్క్‌లను తీసుకెళ్లారని, సాక్ష్యాలను కాపాడాల్సిన పోలీసులతోనే సాక్ష్యాలను మాయం చేయిస్తున్నారని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఇదే తరహా రాజకీయ కక్ష సాధింపు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతోందని జగన్ విమర్శించారు. శ్రీకాకుళం జిల్లాలో జరిగిన ఒక రోడ్డు ప్రమాదాన్ని హత్య కేసుగా మార్చి మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును అక్రమంగా అరెస్ట్ చేశారని ఆరోపించారు.

### గోదావరి ఉగ్రరూపం.. ముంపులోనే లంక గ్రామాలు

తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోనసీమ జిల్లాలోని అనేక లంక గ్రామాలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోయాయి. ముమ్మిడివరం నియోజకవర్గంలోని లంక గ్రామాల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. గోగులంక, గుత్తెనదీవి, కేసనకుర్రు వంటి ప్రాంతాల్లో బోట్ల సర్వీసులను పూర్తిగా నిలిపివేశారు. తానేలంక – గురజాపులంక మధ్య రహదారిపై వరద నీరు ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. అప్పనపల్లి, ముక్తేశ్వరం, కనకాయలంక, అయ్యినవిల్లిలంక, వీరవల్లిపాలెం, అద్దంకివారిలంక వంటి అనేక గ్రామాలకు రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. కొబ్బరి రైతులు తమ పంటను కాపాడుకునేందుకు ట్రాక్టర్ల సహాయంతో కాయలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. రాజమండ్రి వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండటంతో నదీ తీరం కోతకు గురవుతోంది. అధికారులు ఇసుక బస్తాలు వేసి కోతను అరికట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం చింతపల్లి వద్ద, గౌతమి పాయ ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. అయితే, గత రాత్రితో పోలిస్తే ప్రవాహం స్వల్పంగా తగ్గింది.

## ఇండోనేషియాలో ఘోర అగ్నిప్రమాదం..

మంటలు చెలరేగి ఐదుగురు మృతిచెందగా.. 41 మంది గల్లంతయ్యారు. ప్రమాదం జరిగిన సమయంలో ఫెర్రీలో మొత్తం 271 మంది ప్రయాణికులు ఉన్నట్లు స్థానిక అధికారులు తెలిపారు. సమాచారం అందిన వెంటనే సహాయక బృందాలు ఘటనాస్థలికి చేరుకుని రక్షణ చర్యలు చేపట్టాయి. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతుండగా.. మరికొందరిని సురక్షితంగా కాపాడారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇండోనేషియాలోని రెండో అతిపెద్ద నగరమైన తూర్పు జావాలోని సురబయ నుంచి దక్షిణ సులవేసిలోని మకాస్సర్‌కు వెళ్తుండగా ఈ అగ్నిప్రమాదం జరిగింది. ప్రమాదానికి గురైన ఫెర్రీని ముతియారా సంతోసా–2గా అధికారులు గుర్తించారు. సహాయక చర్యల కోసం తొమ్మిది నౌకలను ఘటనాస్థలికి పంపించారు. నౌకకు నిప్పంటుకున్న వెంటనే భారీగా పొగలు వ్యాపించాయి. దీనికి సంబంధించిన వీడియోలు, ఫొటోలు నిమిషాల వ్యవధిలోనే సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. మంటల నుంచి ప్రాణాలను కాపాడుకునేందుకు కొందరు ప్రయాణికులు ఫెర్రీ నుంచి సముద్రంలోకి దూకిన దృశ్యాలు కలవరపెడుతున్నాయి. అయితే, ఈ ప్రమాదానికి గల కారణాలపై అధికారులు ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

## ఇరాన్‌పై దాడులు ఆపేస్తున్నా

ఇకపై దాడులు చేయరాదని పశ్చిమాసియాలోని తమ బలగాలకు ఆదేశాలిచ్చినట్లు శనివారం రాత్రి ట్రంప్ వెల్లడించారు. 'మధ్య ఆసియా భాగస్వాముల విజ్ఞప్తి మేరకు 5నెలలుగా సాగుతున్న యుద్ధానికి ముగింపు పలకాలని నిర్ణయం తీసుకున్నాను. ఇరాన్‌తో శాంతి ఒప్పందం కొలిక్కి వస్తోంది. ఆ ఒప్పందంలో ఇరాన్ హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరవటం, అణుకార్యక్రమాన్ని వదిలేయటం అనే షరతులు కూడా ఉంటాయి. ఇరాన్ భవిష్యత్తుతోపాటు ప్రపంచ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని వారి విన్నపానికి ఒప్పుకున్నాను. ఇరాన్‌పై తాజా దాడుల ప్రణాళికను నిలిపేస్తున్నాను' అని తెలిపారు. ఆదివారం మరో ప్రకటన చేస్తూ.. 'మా క్షిపణులు, యుద్ధ విమానాలు లోడ్‌చేసి సిద్ధంగా ఉన్నాయి' అని ఇరాన్‌ను హెచ్చరించారు.

### నేరుగా యుద్ధం చేయలేకనే: ఇరాన్

ట్రంప్ సంధి ప్రకటనను ఇరాన్ తోసిపుచ్చింది. అమెరికాతో ఎలాంటి ఒప్పందం కుదరలేదని, హోర్ముజ్, అణుకార్యక్రమం విషయంలో ఆయన ప్రకటన పూర్తిగా అబద్ధమని ఇరాన్ రక్షణ మంత్రి మాజిద్ ఎబ్న్ ఇ రెజా ఆదివారం ఎక్స్‌లో ప్రకటించారు. 'మాపై సైన్యంతో యుద్ధంచేసే స్థితిలో అమెరికా ఇప్పుడు లేదు. అందుకే నేరుగా యుద్ధం చేయకుండా ట్రంప్ మానసిక యుద్ధానికి దిగారు' అని ఎద్దేవా చేశారు. అయితే, ఈ రెండు దేశాల మధ్య పరోక్ష చర్చలు సానుకూలంగానే సాగుతున్నాయని చర్చల్లో పాల్గొంటున్న ఒక అధికారి తెలిపారు. ఇరాన్–అమెరికా యుద్ధం ముగింపునకు ఒకవైపు చర్చల ప్రయత్నాలు జరుగుతుండగా.. గాజాపై ఇజ్రాయెల్ మరోసారి విరుచుకుపడింది. శనివారం రాత్రి జరిపిన వైమానిక దాడుల్లో 8 మంది పౌరులు మరణించారు. వీరిలో ఇద్దరు చిన్నారులు, ఒక ఆరు నెలల గర్భిణి కూడా ఉన్నారు.

# మార్చిలో ఎమ్మెల్సీ సంగ్రామం

సెప్టెంబరు 20 నుంచి 30 తేదీల మధ్య ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉందంటున్నారు. అక్టోబరు నుంచి డిసెంబరు 31 వరకు ఓటరు నమోదు ప్రక్రియను కొనసాగించి.. జనవరిలో అభ్యంతరాలు, సవరణ ప్రక్రియ చేపట్టవచ్చని పేర్కొంటున్నారు. అనంతరం ఫిబ్రవరి చివరి వారం లేదా మార్చి మొదటి వారంలో నోటిఫికేషన్ జారీ చేయవచ్చని చెబుతున్నారు. అయితే ఎన్నికలు మార్చిలో జరిగినా.. ఓటరు నమోదు ప్రక్రియ అక్టోబరు నుంచే మొదలు కానుండటంతో క్షేత్రస్థాయిలో ప్రధాన పార్టీలు, అభ్యర్థులు ఇప్పటినుంచే సంసిద్ధమయ్యే ప్రయత్నాల్లో ఉన్నాయి.

అభ్యర్థిత్వం కోసం అధికార పార్టీలో పోటా పోటీ!

ప్రతిపక్షాలతో పోలిస్తే.. అధికార కాంగ్రెస్ పార్టీలో అభ్యర్థిత్వం కోసం తీవ్ర పోటీ నెలకొని ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉండటం ఆ పార్టీకి ప్రధాన సానుకూల అంశంగా మారింది. అలాగే రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 60 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడం, మరో 30 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ల విడుదల ప్రక్రియ కొనసాగుతుండటంతో పట్టభద్రుల్లో ప్రభుత్వం పట్ల సానుకూలత నెలకొని ఉందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు ప్రతినెలా ఒకటో తారీకున వేతనాలు పడుతుండటంతో ఉద్యోగ వర్గాలు కూడా సర్కారు పట్ల సానుకూలంగానే ఉన్నాయని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఉద్యోగులు, పట్టభద్రులు ఈ రెండు ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులకే మద్దతుగా నిలుస్తారని ఆ పార్టీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇన్ని సానుకూలతల కారణంగానే రెండు స్థానాలకూ అభ్యర్థిత్వం కోసం పోటీ తీవ్రంగా ఉందని అంటున్నాయి. హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ స్థానం నుంచి అభ్యర్థిత్వం కోసం ప్రధానంగా టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి, తెలంగాణ పీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు, టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శివసేనారెడ్డి, పార్టీ నేత గౌరీ సతీశ్ తదితరులు పోటీ పడుతున్నారు. ఇక వరంగల్–ఖమ్మం–నల్లగొండ స్థానం నుంచి రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, విజయా డెయిరీ మాజీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, గత అసెంబ్లీ ఎన్నికల్లో స్టేషన్ ఘన్‌పూర్‌లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన ఇందిర, ఓయూ జేఏసీ నేత లోకేశ్ యాదవ్ తదితరులు తమ వంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. అభ్యర్థుల ఎంపికకు త్వరలోనే కమిటీలు వేసి.. కసరత్తు ము మ్మరం చేసే పనిలో పార్టీ నాయకత్వం ఉన్నట్లు చెబుతున్నారు. ఏది ఏమైనా సిట్టింగ్ స్థానమైన వరంగల్–ఖమ్మం–నల్లగొండ స్థానాన్ని నిలబెట్టుకోవడంతోపాటు హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ స్థానాన్ని దక్కించుకోవాలన్న పట్టుదలతో అధికార పార్టీ ఉంది.

### పోటీకి దూరంగా బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్సీ..

హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం బీఆర్ఎస్ సిటింగ్ సీటు అనే విషయం తెలిసిందే. అయితే ఇక్కడి సిటింగ్ ఎమ్మెల్సీ వాణీదేవి.. వచ్చే ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ సీటును నిలబెట్టుకునేందుకు ఆ పార్టీ నాయకత్వం ఇప్పటి నుంచే కసరత్తు ముమ్మరం చేసింది. ఈ స్థానం నుంచి ఐఆర్ఎస్ అధికారి ఒకరిని బీఆర్ఎస్ తరపున పోటీకి దించే ఆలోచన చేస్తున్నట్లు ఇటీవల మహబూబ్‌నగర్‌లో జరిగిన పార్టీ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంకేతాలిచ్చారు. అలాగే శాప్ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నేత ఆంజనేయగౌడ్ తదితరులు తమ వంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఇక వరంగల్–ఖమ్మం–నల్లగొండ స్థానం నుంచి గతంలో పోటీ చేసిన ఏనుగుల రాకేశ్‌రెడ్డినే మళ్లీ రంగంలోకి దించాలా? లేక కొత్త వ్యక్తిని దించాలా? అన్నదానిపై తర్జన భర్జన నడుస్తోంది. మరోవైపు వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డి పేరు కూడా వినిపిస్తోంది. కాగా, 2023 నుంచి వరుస ఎన్నికల్లో ఓటమిపాలవుతూ వస్తున్న బీఆర్ఎస్‌కు ఈ రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు కీలకంగా మారాయి. ముఖ్యంగా.. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన ప్రత్యర్థిగా కొనసాగేందుకు రెండు చోట్లా గట్టిపోటీ ఇవ్వక తప్పదన్న అభిప్రాయం ఆ పార్టీ వర్గాల్లోనే వ్యక్తమవుతోంది.

## భూమికి ఆధార్ లాంటి 'భూధార్' నంబర్: మంత్రి పొంగులేటి

కూడా నిషేధిత జాబితా (ప్రొహిబిటెడ్ లిస్ట్)లో చేర్చలేదని, గత ప్రభుత్వ హయాంలో రూపొందించిన జాబితాపై ప్రస్తుతం సమగ్ర సమీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 276 గ్రామాల్లో భూముల రీ–సర్వే ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు. భవిష్యత్తులో ప్రతి సర్వే నంబర్‌కు ఆధార్ తరహాలో విశిష్ట 'భూధార్' నంబర్‌ను కేటాయించనున్నట్లు ఈ సందర్భంగా ప్రకటించారు. అసైన్డ్ భూముల సమస్యల శాశ్వత పరిష్కారానికి త్వరలోనే స్పష్టమైన, సమగ్రమైన విధానాన్ని తీసుకువస్తామని పొంగులేటి హామీ ఇచ్చారు. అదే సమయంలో ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో ప్రభుత్వం ఏమాత్రం రాజీపడబోదని తేల్చిచెప్పారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధుల విడుదల ఆలస్యమైనప్పటికీ, ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు క్రమం తప్పకుండా చెల్లింపులు జరుపుతామని ఆయన భరోసా ఇచ్చారు.

భూముల విలువ సవరణ అనంతరం రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చే ఆదాయం 10 నుంచి 20 శాతం మేర పెరిగిందని మంత్రి తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా సుమారు రూ.18 వేల కోట్ల ఆదాయం సమకూరుతుందని అంచనా వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## లష్కర్ బోనాల్లో సీఎం రేవంత్ రెడ్డి..

హైదరాబాద్,ఆగస్ట్2: సికింద్రాబాద్‌లోని శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర అంగరంగ వైభవంగా, భక్తిశ్రద్ధలతో కొనసాగుతోంది. ఈ ఉత్సవాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆయన జగన్మాతకు బోనం, పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లష్కర్ బోనాల జాతరలో భాగంగా ఆలయానికి విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన గర్భగుడిలో మహంకాళి అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. తెలంగాణ ప్రజలు సుఖసంతోషాలతో, పాడిపంటలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీతక్క, కాంగ్రెస్ ఎమ్మెల్యే దానం నాగేందర్, బీఆర్ఎస్ శాసనసభ్యుడు తలసాని శ్రీనివాస్ యాదవ్ కూడా పాల్గొన్నారు. వారు కూడా అమ్మవారికి పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వీరితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా ఈ వేడుకల్లో పాలుపంచుకున్నారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఆలయ పరిసరాల్లో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## మెట్రోపై మెలిక!

- రూ.13,600 కోట్లు మీరే సేకరించుకోండి.. రాష్ట్రానికి సూచించిన కేంద్ర ప్రభుత్వం
- అడుగు ముందుకు వేయని 'ఎస్‌బీఐ క్యాప్స్'.. రాష్ట్ర ప్రతినిధిగా జయేశ్ రంజన్
- తమ ప్రతినిధిని ప్రకటించని కేంద్రం.. నెలన్నర అవుతున్నా పురోగతి శూన్యం!

హైదరాబాద్, ఆగస్టు 2 మెట్రో రైలు మొదటి దశ స్వాధీనం, రెండో దశ విస్తరణ అంశంలో కేంద్రం కొత్త మెలిక పెట్టింది. హైదరాబాద్ మెట్రో రైలుపై నెలన్నర క్రితం సీఎం రేవంత్, కేంద్ర మంత్రుల మధ్య జరిగిన ఒప్పందం కార్యరూపం దాల్చకపోగా.. మొదటి దశ స్వాధీనానికి అవసరమైన నిధుల రుణ సేకరణ బాధ్యతను మళ్లీ రాష్ట్రంపైనే పెట్టినట్లు విశ్వసనీయంగా తెలిసింది. మరోవైపు మొదటి దశ స్వాధీనం, రెండో దశ విస్తరణకు కావాల్సిన నిధుల అంచనా, రుణ సేకరణ కోసం 'ఎస్‌బీఐ క్యాప్స్'ను కేంద్రం కన్సల్టెంట్‌గా నియమించింది. కానీ, ఈ అంశంపై ఎస్‌బీఐ క్యాప్స్ ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. ఇక మెట్రో విషయంలో కేంద్రంతో జరిపిన చర్చల మేరకు మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రతినిధిగా నియమించింది. కేంద్రం మాత్రం ఇప్పటి వరకు తమ ప్రతినిధిని ప్రకటించలేదు. ఎస్‌బీఐ క్యాప్స్ ప్రతినిధి ఎవరన్నదీ తేలలేదు. హైదరాబాద్‌లో మెట్రో రైలు మార్గాన్ని విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఫేజ్–1 ద్వారా తమకు ఆశించిన ఫలితాలు రాలేదని, నష్టాలు ఉన్నాయని ఎల్‌అండ్‌టీ సంస్థ ప్రభుత్వానికి తెలిపింది. రెండో దశను విస్తరించాలంటే సాంకేతికంగా ఫేజ్–1ను కూడా ప్రభుత్వమే స్వాధీనం చేసుకోవాలి. అందుకు రూ.13,600 కోట్లు కావాల్సి వచ్చింది. జపాన్‌కు చెందిన ఐఆర్ఎఫ్‌సీ నుంచి తక్కువ వడ్డీకే రుణం తీసుకునేందుకు అన్ని ప్రక్రియలు పూర్తి చేసింది. ఈ క్రమంలోనే హైదరాబాద్ మెట్రో రైలు మొదటి దశకు రుణం మంజూరు, రెండో దశ విస్తరణపై జూన్‌లో సీఎం రేవంత్ కేంద్ర మంత్రులతో చర్చించారు. ఒక్కో దశకు వేర్వేరుగా కాకుండా, రెండు దశలకు కలిపే రుణం తీసుకోవాలని కేంద్రం సూచించింది. దీంతో అప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి ఐఆర్ఎ?ఫసీ నుంచి మంజూరైన రూ.13,600 కోట్ల రుణం నిలిచిపోయింది. దాని స్థానంలో రెండు దశలకు కలిపి ఎంత ఖర్చవుతుంది? ఎక్కడి నుంచి రుణం తేవాలి? తదితర విషయాలపై నివేదిక ఇవ్వడంతో పాటు ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు 'ఎస్‌బీఐ క్యాప్స్'ను కన్సల్టెంట్‌గా నియమించారు. రెండు దశలకు అవసరమైన రుణం ఇచ్చే ఆర్థిక సంస్థలను ఎంపిక చేయడం, రుణం మంజూరుకు మార్గం సుగమం చేయడం ఎస్‌బీఐ క్యాప్స్ బాధ్యతే. ఈ అంశంపై ఎస్‌బీఐ క్యాప్స్ రెండు నెలల్లోపే నివేదికను అందించాలని సూచించారు. కానీ, నెలన్నర గడిచినా ఒక్క అడుగూ ముందుకు పడకపోవడం గమనార్హం.

### రుణ సేకరణ మార్గాలపై అన్వేషణ

జూన్‌లో జరిగిన చర్చల మేరకు హైదరాబాద్ మెట్రో విషయంలో కేంద్రం ఆశించిన స్థాయిలో సహకరించడం లేదు. తాజాగా మొదటి దశ స్వాధీనానికి అవసరమైన నిధులను రాష్ట్రమే సమీకరించుకోవాలన్నట్లు సంకేతాలిచ్చింది. దీంతో రూ.13,600 కోట్ల రుణ సేకరణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలిసింది. గతంలో ఐఆర్ఎ?ఫసీ 4 శాతం వడ్డీకే రుణం ఇస్తామంది. తాజాగా అదే వడ్డీతో రుణం ఇచ్చే సంస్థల వైపు ప్రభుత్వం చూస్తోంది. ఎస్‌బీఐ, ఐసీఐసీఐతో పాటు మరికొన్ని బ్యాంకులను కూడా సంప్రదించనున్నట్లు తెలిసింది. ఐఆర్ఎ?ఫసీ రుణానికి కేంద్రం ఎన్వోసీ మంజూరు చేసి ఉంటే.. మేలోనే మెట్రో మొదటి దశను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ఉండేది. కానీ, చివరి దశలో నిధుల మంజూరు నిలిచిపోవడంతో మెట్రో స్వాధీనం ఆలస్యమవుతూ వచ్చింది.

THARANGALU DAILY NEWS
సోమవారం, 03 ఆగస్టు , 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# సుచిత్ర నుండి కొంపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు జాప్యం పై ధర్నా



**కుత్బుల్లాపూర్ ఆగస్టు 02 ( తరంగాలు )**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుచిత్ర నుండి కొంపల్లి వరకు జరుగుతున్న ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు నత్తనడకన జరుగుతున్నాయని ఆదివారం నేషనల్ హైవే 44 పైన నిర్మించిన ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ పనులు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా నిత్యం రద్దీగా ఉండే రోడ్డులో కన్య కుమారి నుండి కాశ్మీర్ వరకు రోడ్డు మార్గం గుండా ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని,ఈ బ్రిడ్జ్ కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ, వంతెన నిర్మాణం జేఏసీ గా ఏర్పాటు చేసుకొని ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కుంట సిద్దిరాములు,రంగు వెంకటేష్,తోట బిక్షపతి, పోగు సమ్మయ్య, బచ్చ జ్ఞానేశ్వర్, మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్ రెడ్డి,నిరంజన్ వివిధ కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్ మెట్రో కారిడార్‌ను తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ పాదయాత్ర




**కుత్బుల్లాపూర్ ఆగస్టు 02 ( తరంగాలు )**
హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 కింద మేడ్చల్ మెట్రో కారిడార్‌ను తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ, మేడ్చల్ మెట్రో సాధన సమితి ఆదివారం జీడిమెట్లలోని గాంధీ విగ్రహం నుండి జేబీఎస్ మెట్రో హబ్ వరకు శాంతియుత పాదయాత్రను నిర్వహించింది. ఈ పాదయాత్రలో ఉత్తర హైదరాబాద్ నలుమూలల నుండి నివాసి సంక్షేమ సంఘాలు , సీనియర్ సిటిజన్లు, మహిళలు, యువత, నిపుణులు, మెట్రో మద్దతుదారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. యాత్రలో పాల్గొన్నవారు ప్లకార్డులు పట్టుకుని, భారత ప్రభుత్వం, తెలంగాణ ప్రభుత్వం రెండింటినీ హైదరాబాద్ మెట్రో ఫేజ్-2, ముఖ్యంగా మేడ్చల్ కారిడార్ యొక్క ఆమోదం, ప్రారంభాన్ని వేగవంతం చేయాలని కోరుతూ నినాదాలు చేశారు.సభను ఉద్దేశించి మాట్లాడుతూ, తెలంగాణలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నివాస, పారిశ్రామిక, విద్యా, మరియు ఐటీ ప్రాంతాలలో ఉత్తర హైదరాబాద్ ఒకటిగా ఆవిర్భవించిందని, అయితే సమర్థవంతమైన ప్రజా రవాణా వ్యవస్థ లేకపోవడం వల్ల తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ, రహదారి భద్రతా సమస్యలు, కాలుష్యం, సుదీర్ఘ ప్రయాణ సమయాలను ఎదుర్కొంటోందని ఎంఎంఎస్-ఎస్ ప్రతినిధులు పేర్కొన్నారు.రాజకీయ విభేదాలకు అతీతంగా వ్యవహరించి, హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు త్వరితగతిన ఆమోదం లభించి, అమలు జరిగేలా కలిసి పనిచేయాలని సమితి ఇరు ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసింది. మెట్రో అనేది రాజకీయ సమస్య కాదని, ఇది లక్షలాది మంది ప్రయాణికులకు ప్రయోజనం చేకూర్చే మరియు హైదరాబాద్ నిరంతర ఆర్థిక వృద్ధికి తోడ్పడే ఒక ప్రజా అవసరమని అది నొక్కి చెప్పింది. ఈ పాదయాత్ర ఒక నిరంతర ప్రజాస్వామ్య ఉద్యమంలో భాగమని ఎంఎంఎస్ఎస్ ప్రకటించింది. మెడ్చల్ మెట్రో కారిడార్ మొదటి పిల్లర్ నిర్మించే వరకు శాంతియుత ప్రజా అవగాహన కార్యక్రమాలను కొనసాగిస్తామని పునరుద్ఘాటించింది.
ఈ కార్యక్రమంలో బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, మాజీ ఎంపీ సీతారాం నాయక్, మాజీ శాసనసభ్యులు కొండేటి శ్రీధర్, జిల్లా నాయకులు, బీజేవైఎం కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బీజేపీ సీనియర్ నాయకులు పొట్టి శ్రీనివాస్ గుప్తాకు జన్మదిన శుభాకాంక్షలు

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ

వరంగల్ ప్రతినిధి,ఆగస్టు 2,తరంగాలు : బీజేపీ సీనియర్ నాయకులు, వరంగల్ తూర్పు నియోజకవర్గ కన్వీనర్ పొట్టి శ్రీనివాస్ గుప్తా జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ జిల్లా కార్యాలయంలో శు భాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ బీజేపీ కార్యాలయం లో పొట్టి శ్రీనివాస్ గుప్తాను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవి , మాజీ పార్లమెంట్ సభ్యులు సీతారాం నాయక్ , మాజీ శాసనసభ్యులు కొండేటి శ్రీధర్ , మాజీ కార్పొరేటర్ కురుమూర్తి శివకుమార్ , బీజేపీ నాయకులు రత్నం సతీష్ ,మాదాసి రాజు, తిరుపతి తదితరులు పాల్గొని పొట్టి శ్రీనివాస్ గుప్తాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



# పెద్దవంగర ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా దుర్సోజు రాజశేఖర్





- ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గం
- జర్నలిస్టుల సంక్షేమం, ప్రెస్ క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తామని హామీ

**పెద్దవంగర, ఆగస్టు 2 తరంగాలు**
పెద్దవంగర ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా సీనియర్ జర్నలిస్టు దుర్సోజు రాజశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మండల కేంద్రంలోని సాయి గార్డెన్‌లో నిర్వహించిన ప్రెస్ క్లబ్ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీలో గౌరవ అధ్యక్షుడిగా రంగు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా సుంకరి ఓంకార్, ఉపాధ్యక్షుడిగా చట్టు యాకన్న, కోశాధికారిగా బారీ విక్రమ్, కార్యదర్శులుగా జాటోత్ దామోదర్, జాటోత్ సుధాకర్, ఓరిగంటి సైదులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు దుర్సోజు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి సుంకరి ఓంకార్ మాట్లాడుతూ అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు ఎలాంటి జాప్యం లేకుండా అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్కింగ్ జర్నలిస్టులకు ఇంటి స్థలాలతో పాటు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని కోరారు. ప్రెస్ క్లబ్ అభివృద్ధి, జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన విలువల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. యువ జర్నలిస్టులకు అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తూ, సభ్యులందరినీ కలుపుకొని ప్రెస్ క్లబ్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు జర్నలిస్టుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. అలాగే సామాజిక సేవా కార్యక్రమాలు, ప్రజా అవగాహన కార్యక్రమాలను కూడా చేపడతామని వెల్లడించారు.

# ఇంజినీరింగ్ విద్యార్థులపై సీఎం వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

- విద్యార్థులు,తల్లిదండ్రులు, అధ్యాపకులకు రేవంత్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి
- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా. వన్నాల వెంకటరమణ




**వరంగల్ ప్రతినిధి , ఆగస్టు 2, తరంగాలు** :ఇంజినీరింగ్ విద్యార్థుల పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపకులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా. వన్నాల వెంకటరమణ డిమాండ్ చేశారు.వరంగల్ వెంకట్రామ థియేటర్ జంక్షన్‌లో బీజేవైఎం అధ్యక్షులు ఎర్రగొల్ల భరత్ వీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం కార్యక్రమంలో డా. వన్నాల వెంకటరమణ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విద్యార్థులు ఉద్యోగ దరఖాస్తు కూడా చేసుకునే స్థాయిలో లేరన్నట్టుగా ముఖ్యమంత్రి మాట్లాడటం అత్యంత చులకన భావాన్ని ప్రతిబింబిస్తోందని విమర్శించారు. ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ల పట్ల చేసిన వ్యాఖ్యలను ముఖ్యమంత్రి వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి, రాష్ట్రంలోని విద్యార్థుల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఎదురుచూస్తున్నారని, ఫీజులు చెల్లించకపోవడంతో కొన్ని కళాశాలలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆరోపించారు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు.వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను చెల్లించి విద్యార్థులకు న్యాయం చేయాలని డా. వన్నాల వెంకటరమణ డిమాండ్ చేశారు. విద్యార్థులు, తెలంగాణ ప్రజలు ప్రభుత్వ పనితీరును గమనిస్తున్నారని అన్నారు.ముఖ్యమంత్రి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకపోతే బీజేపీ ఆధ్వర్యంలో జిల్లాల వారీగా దిష్టిబొమ్మల దహనం కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, ఇంజినీరింగ్ విద్యార్థులతో కలిసి నిరసన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

# 1వ తేదీ వేతనాల హామీ ఎక్కడ

- ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల ఆర్థిక ఇబ్బందులు
- పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలని ఎన్ హెచ్ ఎం
- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా డిమాండ్



హైదరాబాద్, ఆగస్టు 2,తరంగాలు : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెల 1వ తేదీన వేతనాలు చెల్లిస్తామని పలు ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయడంతో పాటు, అనేక సమావేశాల్లో హామీలు ఇచ్చినప్పటికీ.. ఆ హామీలు పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నెల మొదటి తేదీన వేతనాలు అందకపోవడంతో ఇంటి అద్దె, విద్యుత్ బిల్లులు, ఈఎంఐలు, పిల్లల చదువులు, నిత్యావసర ఖర్చులు, కుటుంబ పోషణ వంటి వాటిని నిర్వహించడం కష్టంగా మారిందని ఉద్యోగులు పేర్కొన్నారు.రెండో పీఆర్‌సీ అమలుకు సంవత్సరం దాటినా ఇప్పటివరకు అమలు చేయలేదని, పీఆర్‌సీ ఎప్పుడు అమలు చేస్తారనే దానిపై కూడా స్పష్టత లేదని ఉద్యోగులు తెలిపారు. దీంతో తమకు రావాల్సిన న్యాయమైన ఆర్థిక ప్రయోజనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం విద్య, వైద్య రంగాలను ప్రక్షాళన చేయడంతో పాటు ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఉద్యోగుల పక్షాన డిమాండ్ చేశారు.ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు అంకితభావంతో పనిచేస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెల 1వ తేదీననే వేతనాలు చెల్లించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు.అలాగే పెండింగ్‌లో ఉన్న పెరిగిన వేతనాలను, గత ప్రభుత్వం విడుదల చేసిన ఏడు నెలల పీఆర్‌సీ బకాయిలను ఉద్యోగులకు తక్షణమే చెల్లించాలని కోరారు.పరిష్కరించకపోతే ఉద్యమంఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి ఉద్యమ కార్యాచరణ చేపడతామని రామ రాజేష్ ఖన్నా హెచ్చరించారు. అవసరమైతే నిరవధిక సమ్మెకు కూడా వెనుకాడబోమని ప్రభుత్వాన్ని కోరారు.

# మండల సమస్యలపై తీర్మానాలు చేయాలి





- కష్టపడి పనిచేసే కార్యకర్తలకే తగిన పదవులు :కొండేటి శ్రీధర్

**ఐనవోలు ప్రతినిధి, ఆగస్టు 2,తరంగాలు** : మండల సమస్యలపై తీర్మానాలు చేయాలని బీజేపీ కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ దిశా నిర్దేశం చేశారు. ఆదివారం ఐనవోలు మండల కేంద్రంలో మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వర్ధన్నపేట మాజీ శాసనసభ్యులు, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ మోర్చా మాజీ అధ్యక్షులు కొండేటి శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కొండేటి శ్రీధర్ మాట్లాడుతూ.. మండల కార్యవర్గ సమావేశాలు కార్యకర్తలు తమ ప్రాంతంలో ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను చర్చించుకునేందుకు మంచి వేదికగా నిలుస్తాయన్నారు. మండలంలో ఉన్న ప్రజా సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి అవసరమైన తీర్మానాలు చేయాలని సూచించారు. పార్టీ కోసం కచ్చితంగా, నిబద్ధతతో పనిచేసే కార్యకర్తలకే తగిన పదవులు దక్కేలా చూడాలని అన్నారు. ఈ అంశాన్ని కూడా తీర్మానాల ద్వారా స్పష్టంగా నిర్ణయించుకోవాలని సూచించారు. మండల సంస్థాగత వ్యవహారాల్లో ఎలాంటి తరతమ్యాలు లేకుండా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలందరూ ఐక్యంగా పనిచేసి, క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కొండేటి శ్రీధర్ సూచించారు. ఈ కార్యక్రమంలో వారితో వర్ధన్నపేట నియోజకవర్గ కన్వీనర్ ముత్తిరెడ్డి కేశవరెడ్డి ,పంతిని గ్రామ సర్పంచ్ శ్రీరాం భూపాల్ , కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు దండు కిషన్ , సీనియర్ నాయకులు మహేష్ గౌడ్ ,మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ అండ

- రెండు కుటుంబాలకు 100కిలోల బియ్యం, 2 ఆయిల్ క్యాన్ పంపిణీ చేసిన ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి





**రాయపర్తి, ఆగస్టు 2,తరంగాలు :** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కొలనుపెల్లి గ్రామానికి చెందిన చిట్యాల జగదంబ, అరురి లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి ఒక్కొక్క కుటుంబానికి 50కిలోల బియ్యం, ఒక నువ్వు నీకేమైనా చొప్పున రెండు కుటుంబాలకు 100కిలోల బియ్యం 2 నూనె క్యాన్లు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేసి అండగా నిలిచారు.. ఈ సందర్భంగా ఫౌండేషన్ తరపున అందించిన సహాయాన్ని రాయపర్తి మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి, కర్ర రవీందర్ రెడ్డి, సంకినేని ఎల్లస్వామి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రామ పార్టీ అధ్యక్షులు వంగల నరసయ్య, పార్టీ ముఖ్య నాయకులు చిట్యాల వెంకన్న, తోట నరసింగం, తోట నందు, మాచర్ల సోమనారాయణ, చిట్యాల సోమయ్య, సత్తూరి వెంకన్న, తోట కృష్ణమూర్తి, రాజు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ ఓబీసీ

## మహాసభను విజవంతం చెయ్యండి

- ఆగస్టు 7న, బెంగుళూరులో జాతీయ ఓబీసీ 11వ మహాసభ
- బీసీలకు చట్ట సభలో 50శాతం రిజర్వేషన్ కల్పించాలి
- బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్



**హన్మకొండ ప్రతినిధి, ఆగస్టు 2,తరంగాలు :** ఆగస్టు 7న బెంగళూరులో జరిగే 11వ, జాతీయ ఓబీసీ మహాసభ పోస్టర్ ను బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ హన్మకొండ నక్కలగుట్ట హరిత హోటల్ నందు ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ ఆగస్టు 7న, అఖిల భారత జాతీయ ఓబీసీ ఆధ్వర్యంలో బెంగళూరులో 11వ, ఓబీసీ మహాసభ జరుగుతున్నది. ఈ మహాసభ కు వరంగల్ ఉమ్మడి జిల్లా నుండి పెద్ద సంఖ్యలో బీసీ కులాలకు చెందిన విద్యార్థులు యువకులు, మహిళలు, బీసీ ఉద్యోగస్తులు, బీసీ ముఖ్య ప్రజాప్రతినిధులు, బీసీ నాయకులు తరలి రావాలని పిలుపునిచ్చారు. జనాభాలో దాదాపు 60శాతం ఉన్న బీసీలు అనేక సం.ల నుండి పోరాడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ డిమాండ్ లను నెరవేర్చడం లేదని అన్నారు. చట్టసభలో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు, దేశవ్యాప్తంగా జరిగే జాతి జనగనణలో బీసీ కులగణన చేపట్టాలి, కేంద్రం లో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ, కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం నిధులు, మహిళా బిల్లు లో బీసీ మహిళలకు సబ్ కోటా, బీసీ ఉద్యోగస్థులకు ప్రమోషన్లలో రిజర్వేషన్, బీసీ క్రిమిలేయర్ రద్దు, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రద్దు చేయడం తదితర డిమాండ్ల సాధన కోసం ఆగస్టు 7న, బెంగుళూరు డాక్టర్ మన్మోహన్ సింగ్ సిటీ యూనివర్సిటీ వేదిక గా, కేంద్ర ప్రభుత్వలను నిలదీయడం జరుగుతుందని అన్నారు. ఈ జాతీయ ఓబీసీ మహాసభకు దేశం లోని 36 రాష్ట్రల నుండి దాదాపు 20వేల మంది బీసీ ముఖ్య నాయకులు హాజరు కానున్నారు అని, వడ్లకొండ వేణు గోపాల్ గౌడ్ తెలిపారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు దాడి మల్లయ్య యాదవ్, బచ్చు ఆనందం, దొడ్డపల్లి రఘుపతి, తమ్మేల శోభరాణి, మాధం పద్మజ దేవి, సుశీల, తెల్ల సుగుణ కిషోర్, అంబాల రవి పటేల్, అరేగంటి నాగరాజు, వేముల మహేందర్ గౌడ్, తంగళ్లపెల్లి రమేష్, దాడి రమేష్ యాదవ్, కోలా ప్రతాప్ గౌడ్, అమరావది సారంగపాణి, శనిగరపు సుమన్, చాగంటి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతి కాలేజ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి ఆగస్టు తరంగాలు** వలిగొండ మండల కేంద్రంలో స్థానిక శివ సాయి ఫంక్షన్ హాల్ లో ప్రగతి జూనియర్ కళాశాల ప్రథమ బ్యాచ్ కు చెందిన విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఆత్మీయ సమ్మేళనానికి ప్రగతి విద్యాసంస్థల స్థాపకులు లెక్చరర్స్ వివిధ గ్రూప్ చెందిన విద్యార్థిని విద్యార్థులు పాల్గొని మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు కాసుల వెంకన్న,పబ్బు వెంకటరమణ,గంధ మల్ల స్వామి రాజ్,పైల ప్రకాష్, వెంకటేష్,మల్లం వెంకటేష్,జగదీశ్వర్, నూతన గంటి వెంకటేష్, శ్యాంసుందర్, సత్యనారాయణ,గట్టు మరియు పబ్బు శ్రీలత, పందిరి రమ,రజిత, చిట్టెడి అరుణ తదితరులు పాల్గొన్నారు.

# మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మాజీ ఎంపీ నామ సుడిగాలి పర్యటన





**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో** : ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖ గ్రానైట్ వ్యాపారి బుగ్గవీటి శ్రీధర్ తండ్రి, ప్రముఖ వైద్యులు డా. బుగ్గవీటి సమత మామయ్య, రిటైర్డ్ ఇంజనీర్ బుగ్గవీటి కోటేశ్వరరావు ఇటీవల పరమపదించిన నేపథ్యంలో బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఆదివారం ఖమ్మం నగరంలోని వారి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కోటేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన నామ, అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు వియ్యంకుడు, తెలుగుదేశం పార్టీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ డా. వాసిరెడ్డి రామనాథం, డా. గౌతమ్, కుటుంబ సభ్యులు, నాయకులు కనకమేడల సత్యనారాయణ, మోరంపూడి ప్రసాద్‌రావు, వాకదాని కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అటుపై చింతకాని మండలం కోమట్లగూడెం గ్రామ మాజీ సర్పంచ్ వేముల నర్సయ్య అనారోగ్యంతో ఖమ్మం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని, ఖమ్మం మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజుతో కలిసి ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. నర్సయ్య ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్న నామ, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. తదుపరి బీఆర్ఎస్ జిల్లా నాయకులు, తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు వనమా విశ్వేశ్వరరావు ఇటీవల అనారోగ్యం నుంచి కోలుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకొని నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, త్వరగా పూర్తిగా కోలుకుని ప్రజా,సామాజిక కార్యక్రమాల్లో మళ్లీ చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. అనంతరం వైరా మున్సిపాలిటీ 5వ వార్డుకు చెందిన కొణతాలపల్లి సుబ్బారావు నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆపై మధిర పట్టణంలోని పీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మహదేవపురం సర్పంచ్ వాసిరెడ్డి నాగేశ్వరరావు మనవడు పంచకట్టు వేడుకలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య తో కలిసి పాల్గొని పావన్ శివచంద్రను ఆశీర్వదించారు. చివరగా ఇటీవల తన మాతృమూర్తిని కోల్పోయిన మాజీ వార్డు కౌన్సిలర్ ధీరావత్ మాధవి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జునరావు, మాజీ మండల అధ్యక్షుడు బాణాల వెంకటేశ్వరరావు, మాజీ పట్టణ అధ్యక్షుడు మద్దెల రవి, మాజీ జడ్పీటీసీ సామినేని హరి ప్రసాద్,మాజీ దిశా కమిటీ సభ్యులు బాదావత్ బాలాజీ, బిక్కి కృష్ణప్రసాద్, రావూరి శ్రీనివాసరరావు, పల్లపోతుల వెంకటేశ్వరరావు, రంగిశెట్టి కోటేశ్వరరావు, చిత్తారు నాగేశ్వరరావు, యన్నంశెట్టి అప్పారావు, బొగ్గుల భాస్కర్ రెడ్డి, అరిగే శ్రీనివాసరరావు, మోరంపూడి ప్రసాద్‌రావు, బంకా మల్లయ్య, వంకాయలపాటి లచ్చయ్య, మాదినేని దుర్గాప్రసాద్,వాకదాని కోటేశ్వరరావు, అబ్బూరి రామన్, వనమా చిన్ని, పెరుమాళ్ల కృష్ణమూర్తి, మిట్టపల్లి సత్యంబాబు, తిరుపతి శ్రీను, నూకల వాసు,నూకల ప్రసాద్, వజినేపల్లి చక్రవర్తి, కారేపల్లి రామకృష్ణ, రంగా సింహాద్రి, రాయిడి భద్రయ్య, బాలాజీ,కొమ్మూరి కనకరత్నం, వేముల శివకృష్ణ, గుజ్జర్లపూడి దేవరాజు,యూఎస్‌కే ఖాసిం,వెంకటేశ్వరరావు,గజ్జల కృష్ణమూర్తి, ఖాజా సైదులు, కొణతాలపల్లి సుజిత్, దారా కృష్ణ, కిషోర్, కేశ శ్రీనివాసరావు, నాళ్ల గంగాధర్, ఖాజా ప్రవీణ్ కుమార్, కోదుమూరు రవి, ఏదునూరి శ్రీనివాసరావు, వల్లభి శ్రీనివాసరావు, పగడాల రవి, నంబూరి రామారావు, మాదినేని లక్ష్మణ్, కోడుమూరు మోహన్, ఆకుల రాజు, ఏలూరు నరసింహారావు, అదూరి ప్రేమ్, నార్వనేని నారాయణ, మాలోజి రాజేష్, కొలగాని దేవరాజు, తెల్లాకుల శ్రీనివాసరావు,ముచ్చింతల కృష్ణా, కోలకాని నాగేశ్వరరావు, పాగి నాగార్జున, యంద్రాతి గోపాలరావు, ముదిగొండ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# గౌస్‌కొండ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న భువనగిరి ఎమ్మెల్యే కుంభం



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి ఆగస్టు 2 తరంగాలు**
పోచంపల్లి మండలం గౌస్‌కొండ గ్రామంలో ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి బోనాల ఉత్సవాల్లో పాల్గొని,అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఎమ్మెల్యే ప్రార్థించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు, గ్రామ ప్రజలు ఎమ్మెల్యే గారికి ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మునుకుంట్ల నరేష్ గౌడ్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఉప్పునూతల వెంకటేష్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,మండల, గ్రామాల ప్రజాప్రతినిధులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మన సంపద రియల్టర్ మట్ట శ్రీనివాస రావు జన్మదినం సందర్బంగా అనాదలకు అన్నధానం



**మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా ఆగస్టు 02 ( తరంగాలు )**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మన సంపద రియల్టర్ ఎండి మట్ట శ్రీనివాస్ రావు జన్మదిన వేడుకలు దుండిగల్ గండి మైసమ్మ పరిధిలోని చిన్నారుల అనాధ ఆశ్రమం సాయి కొరియన్ కృషి హోమ్ అసోసియేషన్ లో అసోసియేషన్ సభ్యుల ఎన్ మధుసూదనాచారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్బంగా మన సంపద రియల్టర్ సభ్యులు ఎండి శ్రీనివాస్ రావు జన్మదిన వేడుకలు ఇక్కడ నిర్వహించడం వారి అదృష్టంగా బావించారు.అనాధ పిల్లల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకొని వారితో కలిసి అల్పాహారం, భోజనం చేయడం చాలా సంతృప్తిగా ఉందని కమిటీ సభ్యుల మధ్య ఎండి వ్యాక్యానించారు. ఇంతమంచి కార్యక్రమం నిర్వహించిన సభ్యులకు ధన్యవాదములు తెలియజేస్తూ టీం సభ్యులు మంచి ఉత్సాహంతో పనిచేస్తూ ముందుకు వెళ్లాలని, ఇలాంటి సేవా కార్యక్రమాల్లో ముందుండాలని, మనస్సుకు తృప్తిగా అనిపించే మంచి పనులు చేయడంలో తన వంతు సహాయసహకారాలు ఉంటాయాని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఎన్ మధుసూదనాచారి తో పాటు యాదగిరి, రమేష్, వెంకటరమణ, రాజమౌళి,శ్యామల రావు, సత్యనారాయణ, సూర్యనారాయణ, రాజేష్, మన సంపద రియల్టర్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్



**?కేసముద్రం,మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, జులై. 02, తరంగాలు**:కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని పలువురు నాయకులు, వారి కుటుంబ సభ్యుల మృతికి మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ తీవ్ర సంతాపం తెలిపారు.?07వ వార్డుకు చెందిన ప్రముఖ ఉద్యమకారుడు, బిఆర్ఎస్ నాయకులు వేముల వెంకటాద్రి రెడ్డి, అలాగే 01వ వార్డుకు చెందిన గూగులోత్ బద్రు తల్లి గూగులోత్ దస్లి ఇటీవల కాలధర్మం చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్,ఆదివారం వారి స్వగృహాలకు వెళ్లారు.?ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ సానుభూతిని తెలిపారు. పార్టీ పరంగా, వ్యక్తిగతంగా ఆ కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.?ఈ పరామర్శ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వెంట మాజీ జెడ్పిటిసి శ్రీనాథ్ రెడ్డి, మాజీ టౌన్ అధ్యక్షుడు గూగులోత్ వీరు నాయక్, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ రవీందర్ రెడ్డి,కౌన్సిలర్లు: జాటోత్ సుజాత హరి నాయక్, పోలు వెంకన్న,ముద్దు రెడ్డి, వెంకట్ రెడ్డి, కొమ్ము రాహుల్,ఆగే రాము, పావిరాల శరత్, రావుల వినయ్ రెడ్డి ?,మాజీ వార్డ్ మెంబర్లు బిర్రు వెంకన్న, బానోత్ భీమా నాయక్, నర్సింగం వెంకటేశ్వర్లు, సుభాష్,బానోత్ దేవేందర్.బాదావత్ గణేష్, బానోత్ వెంకన్న, కాసు సాయి యాదవ్ సుధాకర్,?వీరితో పాటు పలువురు మాజీ ఎంపీటీసీలు, బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# స్నేహం,సేవే జీవితానికి నిజమైన అర్థం

- ఆనంద నిలయం,స్పందన ఆశ్రమాల్లో డాక్టర్ అనితా రెడ్డి ఆధ్వర్యంలో ఫ్రెండ్షిప్ డే వేడుకలు



**హన్మకొండ ప్రతినిధి , ఆగస్టు 2, తరంగాలు** :స్నేహం,సేవే జీవితానికి నిజమైన అర్థం అని డాక్టర్ అనితా రెడ్డి అన్నారు.ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు డాక్టర్ అనితా రెడ్డి హన్మకొండలోని ఆనంద నిలయం బాలికల అనాథ ఆశ్రమం, స్పందన మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో పిల్లల మధ్య స్నేహితుల దినోత్సవ వేడుకలను ఆత్మీయంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పిల్లలకు స్వయంగా ఫ్రెండ్షిప్ బాండ్లు కట్టి, స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ అనితా రెడ్డి పిల్లలను ఆత్మీయంగా దగ్గరకు తీసుకుని "నేను మీ కోసం ఎల్లవేళలా ఉన్నాను.. ఉంటాను" అంటూ ప్రేమతో స్నేహహస్తం అందించారు. దీంతో పిల్లల ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి.ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ.. పిల్లలతో కలిసి ఫ్రెండ్షిప్ డే జరుపుకోవడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. పిల్లలకు ఫ్రెండ్షిప్ బాండ్లు కట్టి, వారిని ఆత్మీయంగా పలకరించడం కంటే గొప్ప స్నేహితుల దినోత్సవ వేడుక మరొకటి లేదనిపించిందని అన్నారు."మన జీవితంలో ఎన్ని బంధాలు ఉన్నా.. మన ఇష్టాలను, కష్టాలను పంచుకోవడానికి భగవంతుడు సృష్టించిన అద్భుతమైన అనుబంధమే స్నేహం. స్నేహం చేయడానికి ఒకే వయసు, ఒకే అంతస్తు, ఒకే హోదా ఉండాల్సిన అవసరం లేదు. ఒకరినొకరు అర్థం చేసుకునే హృదయం, మంచి చేసే మనసు ఉంటే చాలు" అని డాక్టర్ అనితా రెడ్డి అన్నారు.స్నేహం, సేవ తనకు రెండు కళ్లలాంటివని, అందరితో స్నేహం చేయగలగడం తాను అడగకుండానే భగవంతుడు ఇచ్చిన గొప్ప వరమని పేర్కొన్నారు. జీవితంలో స్నేహబంధం ఎప్పటికీ గొప్పదేనని, ప్రతి ఒక్కరూ ఆప్యాయత, ప్రేమ, మానవత్వంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా అందరికీ హ్యాపీ ఫ్రెండ్షిప్ డే శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సుచరిత, ఆర్వికా రెడ్డి, రాఘవ, సరిత, ఆశ్రమాల పిల్లలు తదితరులు పాల్గొన్నారు.




# క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో

## ఆగస్టు 10న జరిగే జైల్ భరో ను జయప్రదం చేయండి




**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి ఆగస్టు 2 తరంగాలు**
నాటి స్వాతంత్ర్య పోరాటానికి ఊపిరిలూదిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో భారతదేశాన్ని కాపాడుకునేందుకు 2026 ఆగస్టు 10వ తేదీన జరిగే జైల్ భరోను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం యాదాద్రి భువనగిరిజిల్లా ఉపాధ్యక్షులు సిర్పంగి స్వామి పిలుపునిచ్చారు. ఆదివారం వలిగొండ మండల పరిధిలోని పులిగిల్ల గ్రామంలో జైల్ భరో కార్యక్రమ విజయవంతం కోసం ముద్రించిన కరపత్రాలను విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలను వేగంగా అమలు చేస్తుందని ఎందరో పోరాట యోధుల ప్రాణ త్యాగాలతో సాధించుకున్న దేశ స్వాతంత్రాన్ని విదేశీ సంస్థలకు తాకట్టు పెడుతూ నయా ఉదారవాద సంస్కరణలు అమలు చేస్తుందన్నారు. నాటి స్వాతంత్ర కాలంలో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను ఉల్లంఘించి నూతన లేబర్ కోడ్లను ముందుకు తెచ్చిందని దీని ద్వారా కార్మిక హక్కులను హరించి వేస్తుందన్నారు, 8 గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచేందుకు యాజమాన్యాలు కార్మికులను దోపిడీ చేసేందుకు పూర్తి స్వేచ్ఛనిస్తుందని.మరోవైపు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తూ నూతన విబిజి గ్రామ్ జీ పథకంగా పేరును మార్చి రాష్ట్ర ప్రభుత్వాలపై పెద్ద ఎత్తున భారం వేస్తూ తన బాధ్యతను తప్పుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్టలు చేస్తుందన్నారు అమెరికా, బ్రిటన్ న్యూజిలాండ్ తో కేంద్ర ప్రభుత్వం స్వేచ్ఛ వాణిజ్యవ్యాపారాలు చేసుకొని భారత వ్యవసాయ రంగంలో 32 దేశాల నుండి దిగుమతులను ప్రోత్సహిస్తుందని వీటికి జీరో సుంకంతో దిగుమతులు రావడంతో దేశీయ వ్యవసాయ ఉత్పత్తుల ధరలు తగ్గిపోయి రైతులు దివాలా తీసి అవకాశాలున్నాయన్నారు భారతదేశంలో ఏటా పద్దెనిమిది లక్షల కోట్ల వ్యవసాయ ఉత్పత్తులు మార్కెట్కు వస్తుండగా కనీసం మద్దతు ధరలు అమలు జరుపుకోవడం వల్ల రైతులు ఏటా నాలుగు లక్షల కోట్లు నష్టపోతున్నట్లు ప్రముఖ ఆర్థికవేత్త అశోక్ గులాటి ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు వ్యవసాయ ఉత్పత్తుల వ్యయం పై 50% కలిపి మద్దతు ధరలు నిర్ణయిస్తామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం ఉత్పత్తి ధరలను తగ్గించి నిర్ణయించడం వల్ల రైతులకు గిట్టుబాటు ధర రావడంలేదని వెంటనే పార్లమెంట్లో కనీస మద్దతు ధరల చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ రకంగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఆగస్టు 10వ తేదీన జిల్లా కలెక్టరేట్ల ముందు జైల్ భరో కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని,ఈ కార్యక్రమంలో వివిధ రంగాల కార్మికులు, రైతులు వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల ఉపాధ్యక్షులు వాకిటి వెంకటరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు దొడ్డి బిక్షపతి,సిఐటియు హమాలి నాయకులు వడ్లకొండ శంకరయ్య, నాయకులు ఈర్ల రమేష్, రాములు,యాదగిరి, మారబోయిన సతీష్, ప్రశాంత్, వడ్డేమాన్ వెంకటయ్య, లతీఫ్, తదితరులు పాల్గొన్నారు

# డీ8 కాలువకు జలకళ రైతుల్లో కొత్త ఆశలు

- ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు చొరవ... మూడు గ్రామాలకు సాగునీటి బాట..!
- మూడు గ్రామాల చెరువులకు నీరందించేలా కాలువ పనులు
- రైతు ప్రయోజనాలే లక్ష్యం..






**సర్పంచుల మండల ఫోరం అధ్యక్షులు పోలేపల్లి శివశంకర్ రెడ్డి ఐనవోలు, ఆగస్టు 2,తరంగాలు** : రైతు ప్రయోజనాలే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని,ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు చొరవతో మూడు గ్రామాలకు సాగునీటి బాట పడుతుందని, దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారనిసర్పంచుల మండల ఫోరం అధ్యక్షులు పోలేపల్లి శివశంకర్ రెడ్డి అన్నారు.వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు ఐనవోలు మండలంలోని ముల్కలగూడెం, నర్సింహులగూడెం, కొండపర్తి గ్రామాలకు డీ8 కెనాల్ ద్వారా నీటిని సరఫరా చేసేందుకు కాలువ పనులు చేపట్టారు.మూడు గ్రామాలకు నీరు చేరేలా జేసీబీ సహాయంతో కాలువను తీయించే పనులను మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు పోలేపల్లి శివశంకర్ రెడ్డి, ముల్కలగూడెం సర్పయాచ్ రాధిక లింగరాజు పర్యవేక్షించారు. ఈ కాలువ ద్వారా మెల్లకుంట, తుర్కలకుంట, తాళ్లకుంట, కొండపర్తి ఊరచెరువులకు నీరు చేరే అవకాశం ఉంది. చెరువులకు నీరు అందితే రైతులకు వ్యవసాయానికి ఎంతో దోహదపడుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నీటి సరఫరాకు చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో భాస్కర్ రెడ్డి, కట్కూరి బాబు, యాకుబ్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డితో పాటు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత వైఖరి

- గ్రూప్స్ అభ్యర్థి వేణు ఆత్మహత్యాయత్నం
- ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ఆగ్రహం
- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి పువ్వాడ



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :** ముదిగొండ మండలం, కొత్త లక్ష్మీపురం గ్రామానికి చెందిన గడ్డం వేణు అనే యువకుడు గత ఐదు సంవత్సరాలుగా గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు.ప్రభుత్వం ఒకే ఒక్క గ్రూప్ నోటిఫికేషన్ ఇచ్చి, ఇప్పటి వరకు వేరే ఏ నోటిఫికేషన్ విడుదల చేయకపోవడంతో తీవ్ర మనస్థాపం చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రస్తుతం ఖమ్మంలోని ప్రశాంతి హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్న వేణును నేడు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ పార్లిమెంట్ సభ్యులు నామా నాగేశ్వరరావు, శాసన మండలి సభ్యులు తాతా మధుసూదన్, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు తదితర ముఖ్య నాయకులు పరామర్శించి, ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ మోసాలకు వేణు ఆవేదన నిదర్శనం ఎన్నో మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తుందనడానికి వేణు ఆత్మహత్యా ప్రయత్నమే ఉదాహరణ. ఆత్మహత్యాయత్నానికి ముందు వేణు ఒక లేఖ రాసి, తన బాధ రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్కలకు చేరేలా సోషల్ మీడియాలో షేర్ చేయాలని నిరుద్యోగులను కోరడం కలచివేసింది. వేణు పరిస్థితి చూస్తుంటే కళ్లెంబడి నీళ్లు వస్తున్నాయి.ఓటు వేసి గెలిపిస్తే ద్రోహం చేశారు:"వేణు తల్లి మానసిక వికలాంగురాలు, తండ్రి కల్లు గీత కార్మికుడు. ఎం.ఎస్సీ చదివిన వేణు ఉద్యోగం రాక, 'ఒక్క నోటిఫికేషన్ వచ్చింది, ఇక నాకు జీవితంలో ఉద్యోగం రాదు, కాంగ్రెస్ చెప్పింది మోసమని అర్థమైంది' అని రోదించాడు. గత ఎన్నికల్లో హైదరాబాద్ నుండి వచ్చి తన ఓటుతో పాటు కుటుంబ సభ్యుల ఓట్లు కూడా భట్టి విక్రమార్క కి, కాంగ్రెస్ పార్టీకి వేశానని, కానీ తన ఓటుకు విలువ లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం, భట్టి విక్రమార్క మోసం చేశారని వేణు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. ఇంటి స్థలం కూడా లేని నిరుపేద కుటుంబం: "వేణు కుటుంబానికి ఇల్లు లేక కిరాయి ఇంట్లో ఉంటున్నారు. ఈ జిల్లాకు చెందిన గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని ప్రశ్నిస్తున్నాను--- మీ ప్రభుత్వంలో పేదవారికి ఇల్లు ఇచ్చే క్రైటీరియా ఏమిటి? ఒక బీసీ కుటుంబంలో తల్లి మానసిక వికలాంగురాలై, ఇల్లు లేక అవస్థలు పడుతుంటే మీకు కనిపించడం లేదా?"నిరుద్యోగులు అధైర్యపడొద్దు: "రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ యువకులందరికీ బీఆర్ఎస్ పార్టీ తరపున విజ్ఞప్తి చేస్తున్నాం---మీరు ఎవరూ అధైర్యపడొద్దు, తొందరపడి ఆత్మహత్యలు చేసుకోవద్దు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వలేదనేది వాస్తవం. ఒక రెండేళ్లు ఓపిక పట్టండి, మళ్లీ కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుంది. నిరుద్యోగ యువత అందరినీ వంద శాతం ఆదుకుంటాం.పోలీసుల నిర్బంధంపై మండిపాటు:
"హాస్పిటల్ వద్ద రాత్రి నుంచి రాక్షస పాలన సాగుతోంది. పోలీసులు పెట్టి కుటుంబ సభ్యులను కూడా వేణు దగ్గర ఉండనివ్వడం లేదు. పరామర్శించడానికి వచ్చిన మాజీ మంత్రి, మాజీ లోక్‌సభ పక్ష నేత, మాజీ జెడ్పీ చైర్మన్ నన్ను డోర్లు పెట్టి ఆపే ప్రయత్నం చేస్తున్నారు. పోలీసులను, పికెట్లను పెట్టి ఆపినా ప్రజల్లో వచ్చే ఆగ్రహాన్ని ఈ ప్రభుత్వం చవిచూడక తప్పదు. చివరగా, ఆత్మహత్యా ప్రయత్నం చేసిన సోదరుడు వేణుకు తక్షణమే ప్రభుత్వం స్పందించి,మెరుగైన ఉచిత వైద్య సౌకర్యాల కల్పించి ప్రాణాలను కాపాడాలి, వేణు నిరుపేద కుటుంబానికి తక్షణమే ప్రభుత్వం లిపక్కా ఇల్లు మంజూరు చేయాలి అని బీఆర్ఎస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తూ, సోదరుడు వేణు కుటుంబానికి రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తాతా మధుసూదన్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ గుండాల ఆర్ జీ సి కృష్ణ, సీనియర్ నాయకులు, ఉద్యమకారులు ఉప్పల వెంకటరమణ, మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, నగర మండల పార్టీ అధ్యక్షులు పగడాల నాగరాజు, వాచేపల్లి లక్ష్మా రెడ్డి, అజ్మీరా వీరు నాయక్, మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి, మాజీ కార్పొరేటర్ షేక్ మక్బూల్, అయ్యప్పరెడ్డి జ్యోతి రెడ్డి, నాయకులు సామినేని హరిప్రసాద్, బిరెడ్డి నాగచంద్రారెడ్డి, బంక మల్లయ్య, మహమ్మద్ రఫీ, మోరంపూడి ప్రసాద్, గుద్దేటి మాధవరావు, గడ్డం వెంకట్, పగడాల రవికుమార్,ఆరెంపుల వీరభద్రం, యడవల్లి బిక్షం, మాటేటి కిరణ్ కుమార్, నాగార్జున, శంకర్ తదితర నాయకులు పాల్గొన్నారు.



## బోనాల సంబరాల్లో పాల్గొన్న టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎత్తరి మారయ్య



**కుత్బుల్లాపూర్ ఆగస్టు 02 ( తరంగాలు )**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల మహోత్సవాలు భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా కొనసాగుతున్న సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దుండిగల్ తాండా--2లో నిర్వహించిన బోనాల వేడుకల్లో టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎత్తరి మారయ్య పాల్గొని భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న ఆయన రాష్ట్ర ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, ఐశ్వర్యాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించారు. వేడుకలకు విచ్చేసిన ఎత్తరి మారయ్యకు ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు ఘన స్వాగతం పలికారు.అనంతరం ఆలయ కమిటీ తరఫున శాలువాతో సన్మానించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎత్తరి మారయ్య మాట్లాడుతూ, బోనాల పండుగ తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే మహోన్నత ఆధ్యాత్మిక వేడుక అని పేర్కొన్నారు. ఈ పండుగ సమాజంలో ఐక్యత, సామరస్యం, భక్తి భావాలను మరింత బలోపేతం చేస్తుందని, అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలు, శాంతి, శ్రేయస్సుతో ఉండాలని ఆకాంక్షించారు. ఉత్సవాల్లో మహిళలు బోనాలతో అమ్మవారికి మొక్కులు చెల్లించగా, యువత సంప్రదాయ కళారూపాలతో సందడి చేసి వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆలయ ప్రాంగణమంతా భక్తి పారవశ్యంతో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు రవీందర్ నాయక్, శాంత నాయక్, బెంజ్ మ్యాన్, ఆలయ కమిటీ సభ్యులు ప్రేమ్ సింగ్, ప్రవీణ్ నాయక్, శ్రీకాంత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

## రాష్ట్రస్థాయి సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన కూనూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు



**జఫర్గడ్ ప్రతినిధి, ఆగష్టు 2,(తరంగాలు ):**ఉమ్మడి వరంగల్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో బాల్ బ్యాడ్మింటన్ సీనియర్ మెన్ అండ్ ఉమెన్ విభాగంలో ఎంపిక పోటీలను నిర్వహించినట్లు ఫిజికల్ డైరెక్టర్ ఆకుల సాయికుమార్ తెలిపారు.ఎంపిక పోటీలకు కూనూరు ఉన్నత పాఠశాల నుండి చెవునబోయిన పూజశ్రీ, సుతారి రిషిత,బుల్లె అమూల్య ఎంపికయ్యారు .ఎంపికైన క్రీడాకారులు ఈనెల 7 8 9 తేదీలలో మహబూబ్ నగర్ జిల్లా వనపర్తి లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అసోసియేషన్ బాల్ బ్యాడ్మింటన్ సీనియర్ ఉమెన్స్ విభాగంలో ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ సాయికుమార్ తెలిపారు.కాగా ఈ విద్యా సంవత్సరం పూజశ్రీ ట్రిపుల్ ఐటీ బాసర, రిషిత పాలిటెక్నిక్ వరంగల్ నందు క్రీడా కోటాలో సీట్లు పొందడం గమనార్హం, అమూల్య ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్నారు. సందర్భాన్ని పురస్కరించుకొని పాఠశాల హెడ్మాస్టర్ మహమ్మద్ పర్వాజ్ మాట్లాడుతూ కృషి పట్టుదల ఉంటే విద్యార్థులు ఏ రంగంలోనైనా విజయం సాధిస్తారు అని తెలుపుటకు వీరే నిదర్శనమనిఅన్నారు . కూనూరు ఉన్నత పాఠశాలలో చదువుతో పాటు పిల్లలకు క్రీడల్లో మంచి తర్ఫీదునిస్తూ ప్రోత్సహిస్తున్నామని ఎంపికైన క్రీడా విద్యార్థులను వ్యాయామ విద్య ఉపాధ్యాయుడు ఆకుల సాయికుమార్ లను హెడ్మాస్టర్ పర్వాజ్ అభినందించారు.విద్యార్థుల ఎంపికకు కృషి చేస్తున్న ఉమ్మడి వరంగల్ జిల్లా, జనగామ జిల్లా బాధ్యులు గాదెపాక అయోధ్య కాటంరాజి రెడ్డి , సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు కూనూరు గ్రామ వాస్తవ్యులు కేశవరెడ్డి లకు కూనూరు ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ మహమ్మద్ పర్వాజ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్ర అసోసియేషన్ కార్యదర్శి రమణ,ఉమ్మడి వరంగల్ జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షులు గాదెపాక అయోధ్య, కోశాధికారి కాటంరాజి రెడ్డి, సీనియర్ క్రీడాకారులు కూనూరు గ్రామ వాస్తవ్యులు కేశవరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ సాయికుమార్, జిల్లా రాష్ట్రస్థాయి అసోసియేషన్ బాధ్యులు క్రీడాకారులు పాల్గొన్నారు.



## పలువురు మృతుల కుటుంబాలను పరామర్శించిన సీనియర్ నాయకులు,మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రాములు



**వరంగల్ జిల్లా ప్రతినిధి,ఆగస్టు 2,(తరంగాలు)**

పర్వతగిరి మండలం లోని పలు గ్రామాల్లో మృతుల కుటుంబాలను,క్షతగాత్రులను ఆదివారం నాడు సీనియర్ నేత,మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రాములు పరామర్శించారు. తొలుత నిన్న గుంటూరుపల్లి వద్ద ఆక్సిడెంట్ లో చేయవిరిగిన సిరికొండ ప్రశాంత్ ను ఎంజియం లో పరామర్శించి ధైర్యం చెప్పి,దౌలత్ నగర్ లో విలేఖరి గడ్డం కరుణాకర్ తండ్రి గడ్డం సైదులు ఇటీవల మృతి చెందగా ఓదార్చి, అన్నారంషరీఫ్ గ్రామంలో మాజీ రైతు బంధు అధ్యక్షులు ఈరగాని సాంబయ్య సతీమణి సంవత్సరీకంలో పాల్గొన్నారు. తదుపరి ప్రప్రథమంగా నూతన సర్పంచ్ గా గెలిచిన మహేందర్ స్వగృహంలో అడుగిడిన సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించారు.ఆయన వెంట సర్పంచ్ గాడిపెల్లి మహేందర్,మాజీ వైస్ ఎంపీపీ గంగాధర్ రావు,మాజీ జిల్లా పరిషత్ సభ్యులు మహమ్మద్ సర్వర్,మాజీ సర్పంచ్ లు గోనె సంపత్,బాబు,తెలుగు దేశం నాయకులు,క్రిష్ణ,జనగాం వెంకటేశ్వర్లు, నాయకులు రామ్మూర్తి,కుమార్, ఉదయ్,కొయ్యడి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



# కళాకారులకు పెద్దన్న
# పేదలకు భరోసా “ఈగ మల్లేశం”





- సేవా ప్రస్థానానికి ఘన సత్కారం..
- ఈగ మల్లేశం - సంగీత దంపతులకు ‘స్వరాభిషేకం’ వేదికపై ఘన సన్మానం
- కళా,సామాజిక,ప్రజాసేవకు గుర్తింపు
- ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, ఎస్. జానకి మధురస్మృతులలో నిర్వహించిన కార్యక్రమం

హనుమకొండ ప్రతినిధి,:
కళాకారుల సంక్షేమం, నిరుపేదలకు చేయూత, విద్యార్థులకు విద్యాసహాయం, సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రజల మధ్య ప్రత్యేక గుర్తింపు పొందిన ఈగ మల్లేశం ఘన సన్మానం అందుకున్నారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, గానకోకిల ఎస్. జానకి మధురస్మృతులను స్మరించుకుంటూ నిర్వహించిన “స్వరాభిషేకం” మహోత్సవ వేదికగా ఈ సత్కార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఈగ మల్లేశం-సంగీత దంపతులకు గజమాలతో సేవను జీవిత ధ్యేయంగా మలచుకుని నాలుగు దశాబ్దాలకు పైగా ప్రజాజీవితంలో కొనసాగుతున్న ఈగ మల్లేశం గారి సేవా ప్రస్థానాన్ని నిర్వాహకులు ఈ సందర్భంగా కొనియాడారు. రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో ఆయన అందించిన సేవలను గుర్తుచేస్తూ ఘనంగా సత్కరించారు.

### కళాకారుల సంక్షేమానికి అండగా..

ఉభయ తెలుగు రాష్ట్రాల కళాకారుల సంక్షేమ మండలి అధ్యక్షునిగా కళాకారుల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి కృషి చేస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. మరుగునపడుతున్న జానపద కళారూపాలను, లిపిలేని కళారూపాలను కాపాడటంతో పాటు కళాకారులకు గుర్తింపు, ప్రోత్సాహం అందించేందుకు ఆయన కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.
నటుడిగా నాటకాలలో నటించడంతో పాటు పలు చలనచిత్రాలకు రచయితగా, గాయకుడిగా కూడా కళారంగంతో తన అనుబంధాన్ని కొనసాగించారని గుర్తుచేశారు.

### నిరుపేద కుటుంబాలకు చేయూత

వేలాది నిరుపేద యువజంటల వివాహాలకు ఆర్థిక సహాయం అందించడం, విద్యార్థులకు విద్యాసహాయం చేయడం, పేదలకు గృహనిర్మాణానికి సహకరించడం, ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం వంటి సేవా కార్యక్రమాలను నిర్వాహకులు ప్రస్తావించారు.
నిరుపేద కళాకారులకు ప్రోత్సాహం అందించడంతో పాటు ప్రభుత్వ పింఛన్లు అందేలా కృషి చేసినట్లు తెలిపారు.

### కరోనా సమయంలోనూ సేవలు

కరోనా మహమ్మారి సమయంలో సురభి కళాకారులు, ఇతర కళాకారులు, నిరుపేదలకు ఆహారం, నిత్యావసర వస్తువులు, ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారని పేర్కొన్నారు. ఆపద సమయంలో అనేక కుటుంబాలకు ఆయన సేవలు భరోసా కల్పించాయని తెలిపారు.

### పద్మశాలి సమాజ అభ్యున్నతికి కృషి

అఖిల భారత పద్మశాలి జాతీయ అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహిస్తూ చేనేత కుటుంబాల సంక్షేమానికి కృషి చేస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. వివిధ ప్రాంతాల్లోని చేనేత కుటుంబాల సమస్యలను పరిష్కరించేందుకు, వలసలను తగ్గించేందుకు తనవంతుగా సహకరిస్తున్నారని పేర్కొన్నారు.

### తెలంగాణ ఉద్యమంలోనూ కీలక పాత్ర

తెలంగాణ సాధన ఉద్యమ సమయంలో ప్రజల్లో ఉద్యమస్ఫూర్తిని పెంపొందించడంలో భాగంగా ‘దూంధాం’ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన వారిలో ఈగ మల్లేశం కీలక పాత్ర పోషించారని నిర్వాహకులు తెలిపారు. రాష్ట్ర రాజకీయ పార్టీల యువజన సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ (జేఏసీ) తొలి కన్వీనర్‌గా కూడా పనిచేశారని గుర్తుచేశారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఎన్టీఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లే క్రమంలో ప్రజాజీవితంలో కొనసాగుతూ, ఆలిండియా అభిమాన సంఘం గౌరవ అధ్యక్షునిగా సేవలందిస్తున్నారని తెలిపారు. పదవిని సేవకు సాధనంగా మార్చుకున్నారంటూ ప్రశంసలు కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల సంస్థ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించి గ్రామీణాభివృద్ధి, కుటీర పరిశ్రమలు, స్వయం ఉపాధి రంగాలకు సేవలందించారని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా కూడా సేవలందిస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. “పదవులను అలంకరించడం కాదు.. పదవులకు ప్రజోపయోగ పరిమళాన్ని అద్దడమే ఈగ మల్లేశం సేవా తత్వం” అని నిర్వాహకులు కొనియాడారు.
“ఒక వ్యక్తిని కాదు.. ఒక సేవా తత్వాన్ని సత్కరిస్తున్నాం”
ఈగ మల్లేశం పేరు ఒక వ్యక్తి పేరు మాత్రమే కాదని, అది కళాకారులకు భరోసా, నిరుపేదలకు అండ, సమాజానికి సేవా సంప్రదాయానికి ప్రతీకగా నిలిచిందని నిర్వాహకులు పేర్కొన్నారు. “కళాకారులకు అందించిన సహాయం కేవలం ఆర్థిక బలం కాదు.. వారి ఆత్మవిశ్వాసానికి అభయహస్తం. పేదలకు అందించిన చేయూత కేవలం దానం కాదు.. మానవత్వానికి చేసిన మహాయజ్ఞం” అంటూ ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఈగ మల్లేశం సేవలను గుర్తిస్తూ “స్వరాభిషేకం” వేదికపై ఘనంగా సత్కరించి సన్మాన పత్రాన్ని అందజేశారు. కళాసేవ రత్న అవార్డు గ్రహీత, కేంద్ర ఖాదీ,చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం మాట్లాడుతూ ఈ స్వరాభిషేక కార్యక్రమం మొదటగా మద్రాస్ లో దివంగత బాలసుబ్రహ్మణ్యం నిర్వహించినప్పుడు తనను ఎంపిక చేయడం జరిగిందన్నారు. అయితే అంత దూరం వెళ్లి అవార్డు తీసుకునే పరిస్థితిలో నేను లేకపోవడం వల్ల ఓరుగల్లు కళాకారులు ఆ అవార్డును ఎలాగైనా కలలకు పుట్టినిల్లు అయిన వరంగల్లో నిర్వహించి మా కళాకారుని సన్మానించుకుంటామని వారికి మాట ఇచ్చారని అన్నారు. వారి కోరిక మేరకు శనివారం నాకు ఈ సన్మానం చేయడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. తన కుటుంబ కళాకారులకు చెందింది అని, కలల కోసం అహర్నిశలు కృషి చేస్తానని అన్నారు.



# వరంగల్ జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడిగా వేముల ప్రభాకర్ పటేల్

- దీర్ఘకాల సేవలకు పార్టీ గౌరవం
- అధికారం ఉన్నా లేకున్నా పార్టీ జెండానే భుజాన మోసిన కార్యకర్తకు గుర్తింపు
- విధేయతకే తొలి ప్రాధాన్యం అని నిరూపించిన భాజపా



**ఐనవోలు, ఆగస్టు 2, తరంగాలు :** అధికారం ఉన్నా లేకపోయినా భారతీయ జనతా పార్టీని విడిచిపెట్టకుండా, క్షేత్రస్థాయిలో పార్టీ సిద్ధాంతాల ప్రచారం కోసం నిరంతరం శ్రమించిన కార్యకర్త ప్రభాకర్ పటేల్ వేములకు పార్టీ సముచిత గుర్తింపు ఇచ్చింది. ఐనవోలు మండలం వనమాల కనపర్తి గ్రామానికి చెందిన ఆయనను వరంగల్ జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడిగా నియమించడం పార్టీ విధేయతకు,నిబద్ధతకు ఇచ్చిన గౌరవంగా రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. పార్టీ అధికారంలో లేకున్నా ప్రతి కార్యక్రమంలో చురుకుగా పాల్గొంటూ, గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు బీజేపీ బలోపేతానికి కృషి చేసిన ప్రభాకర్ సేవలను గుర్తించిన పార్టీ నాయకత్వం ఆయనకు ఈ కీలక బాధ్యతలను అప్పగించింది. పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసే కార్యకర్తలను ప్రోత్సహించడంలో భాగంగానే ఈ నియామకం జరిగినట్లు బీజేపీ శ్రేణులు పేర్కొంటున్నాయి. ఈ సందర్భంగా ప్రభాకర్ పటేల్ వేముల మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ నాయకత్వానికి, ముఖ్యంగా ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కూచన క్రాంతి కుమార్కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి ఆశీస్సులతో పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, కాషాయ జెండాను మరింత ఎత్తుకు తీసుకెళ్లేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. ప్రభాకర్ పటేల్ వేముల నియామకంతో ఐనవోలు మండల బీజేపీ కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నెలకొనగా, ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్.



**భద్రాద్రి జిల్లా బ్యూరో తరంగాలు న్యూస్ ఆగస్టు 2**
ఆగస్ట్ 3 వ తేదీ, సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు ఉదయం 10గంటలకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా ప్రజల సౌకర్యార్థం సబ్ కలెక్టర్ భద్రాచలం కార్యాలయంలో, మరియు ఆర్డీవో కార్యాలయం కొత్తగూడెంలో ప్రజావాణి నిర్వహించబడుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# 18 ఏండ్ల నిరీక్షణకు తెర తన్విదే తైపీ టైటిల్

### మహిళల సింగిల్స్‌లో జయకేతనం టైటిల్ గెలిచిన అతి పిన్న వయస్కురాలిగా రికార్డు

తైవాన్ : భారత యువ బ్యాడ్మింటన్ సంచలనం తన్వి శర్మ తైపీ ఓపెన్‌లో సరికొత్త చరిత్ర సృష్టించింది. తైవాన్‌లో జరిగిన తైపీ ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో ఆమె మహిళల సింగిల్స్ టైటిల్‌ను గెలుచుకుంది. పూర్తి ఏకపక్షంగా సాగిన ఫైనల్‌లో తన్వి.. 21-16, 21-16తో ఆరో సీడ్ లిన్ ఎన్‌గుయెన్ (వియత్నాం)ను వరుస సెట్లలో చిత్తుచేసి తన కెరీర్‌లో తొలి బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ టూర్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. గతంలో యూఎస్ ఓపెన్ 300 టోర్నీలో ఫైనల్ చేరినా రన్నరప్‌తో సరిపెట్టుకున్న తన్వి.. ఈసారి మాత్రం పట్టు వీడకుండా ఆడి 36 నిమిషాల్లోనే ప్రత్యర్థిని చిత్తుచేసింది. తాజా విజయంతో టోర్నీలో ఈ పంజాబ్ అమ్మాయి భారత 18 ఏండ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించింది. 2008లో హైదరాబాదీ షట్లర్ సైనా నెహ్వాల్ తర్వాత ఈ టోర్నీలో టైటిల్ నెగ్గిన తొలి భారత షట్లర్‌గా గుర్తింపు సాధించింది. అంతేగాక అత్యంత పిన్న వయసు (17 ఏండ్ల 222 రోజులు)లోనే తైపీ ఓపెన్ గెలిచిన షట్లర్‌గానూ రికార్డులకెక్కింది. 2006లో కొరియా ప్లేయర్ లీ యాంగ్ డె 17 ఏండ్ల 287 రోజులకు సింగిల్స్‌లో విజేతగా నిలువగా తన్వి ఆ రికార్డును బ్రేక్ చేసింది.

### ఏకపక్ష విజయం

తనకంటే మెరుగైన ర్యాంకు కల్గిన ప్రత్యర్థులను చిత్తుచేస్తూ ఫైనల్ చేరిన తన్వి.. టైటిల్ పోరులోనూ అదే జోరు కొనసాగించింది. ప్రత్యర్థిని నెట్ దగ్గరికి తీసుకొచ్చి బోల్తా కొట్టిస్తూ ఆరంభంలోనే 4-1 ఆధిక్యం సాధించిన ఆమె ఆ తర్వాత వెనుదిరిగి చూసుకోవ్వాలిన అవసరమే రాలేదు. అద్భుతమైన క్రాస్ కోర్ట్ స్మాష్‌లకు తోడు డ్రాప్ షాట్లతో ఆధిక్యాన్ని 10-2కు పెంచుకుంది. ఆ తర్వాత కాస్త తడబడటంతో వియత్నాం అమ్మాయి పుంజుకునే యత్నం చేసింది. కానీ వెంటనే తేరుకున్న తన్వి.. వరుసగా ఐదు గేమ్ పాయింట్లతో తొలి గేమ్‌ను తన ఖాతాలో వేసుకుంది. రెండో గేమ్ ప్రారంభంలోనే ఎన్‌గుయెన్ 3-0తో ఆధిక్యంలోకి వెళ్లినా భారత షట్లర్ క్రమంగా పుంజుకుంటూ స్కోర్లను సమం చేసి 8-7తో ఆధిక్యంలోకి వచ్చింది. ఈ సమయంలో తన్వి.. రెండు అద్భుతమైన విన్నర్లతో విరామ సమయానికి 11-8తో ఆధిక్యత సాధించింది. నెమ్మదిగా ఆధిక్యాన్ని పెంచుకుంటూ వెళ్లిన భారత అమ్మాయి.. రెండో గేమ్‌తో పాటు మ్యాచ్‌నూ సొంతం చేసుకుంది. కాగా తనకు బంగారు పతకం దక్కిన అనంతరం ఆమె.. దానిని తీసుకెళ్లి పక్కనే ఉన్న కోచ్ పార్క్ టె సాంగ్ మెడలో వేసి గురుభక్తిని చాటి అందరి మనసులు గెలుచుకోవడం కొసమెరుపు.

# పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్ మెంట్‌లో జిల్లా నిరుద్యోగ యువతకు అన్యాయం

**అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్**




**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్ సి, ఆగస్టు 2,తరంగాలు:** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్ మెంట్ లో జిల్లా నిరుద్యోగ యువతకు అన్యాయం జరిగిందని అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ ఆరోపించింది. వలిగొండ మండల సమితి సమావేశం మేడి దేవేందర్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు ఏల్లంకి మహేష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ జూలై 29న రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినటువంటి పోలీసు రిక్రూట్మెంట్ నోటిఫికేషన్ లో కోడ్ నెంబర్ 21 సివిల్ కానిస్టేబుల్ మరియు కోడ్ నెంబర్ 22 ఏఆర్ కానిస్టేబుల్ జాబితాలో యాదాద్రి భువనగిరి జిల్లా ఖాళీలు లేకపోవడం వల్ల జిల్లాకు సంబంధించిన నిరుద్యోగుల్లో ఆందోళన మొదలైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2021 డిసెంబర్ 317 జీవో ప్రకారం యాదాద్రి భువనగిరి జిల్లా,రాచకొండ పరిధిలో ఉండేది నల్గొండ సూర్యాపేట ఇతర జిల్లాలకు చెందిన పలువురు కానిస్టేబుళ్లు యాదాద్రి జిల్లాలో విధులకు కేటాయించబడ్డారు. ఈ కేటాయింపు పారదర్శకంగా జరగలేదన్నారు. అనంతరం ప్రభుత్వం పోలీస్ వ్యవస్థను పునర్వ్యవస్థీకరించి యాదాద్రి భువనగిరి జిల్లాను రాచకొండ కమిషనరేట్ పరిధి నుండి వేరు చేసి 6నెలలు గడుస్తున్నప్పటికీ ఇతర జిల్లాలకు చెందిన కానిస్టేబుల్ లను వారు సంబంధిత స్థానిక కేడర్లకు బదిలీ చేయకపోవడం వల్ల నల్లగొండ సూర్యపేట జిల్లాలో గణనీయమైన ఖాళీలు ఏర్పడ్డాయి కానీ యాదాద్రి భువనగిరి జిల్లాలో ఖాళీలు లేకుండా పోయింది. జిల్లాకు చెందిన నిరుద్యోగులకు అన్యాయం జరిగిందన్నారు. వెంటనే ఇతర జిల్లాల నుంచి వచ్చిన కానిస్టేబుళ్లను సంబంధిత స్థానిక కేడర్లకు బదిలీ చేసి వాస్తవిక ఖాళీలను గుర్తించి నోటిఫికేషన్ వెయ్యాలని ప్రభుతాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎండి నయీమ్, మండల కార్యదర్శి సుద్దాల సాయికుమార్, మండల సహాయ కార్యదర్శి గుండె గాని నాగరాజు, మండల ఉపాధ్యక్షులు కనక బోయిన నందు, కార్యవర్గ సభ్యులు సంఘీ కృష్ణ, కన్నెబోయిన శివ సాయి, ఫణి ధర్, తదితరులు పాల్గొన్నారు.

# పోలోజు యుగంధర్ శర్మకు పురోహిత
# జ్యోతిష్య,వాస్తు వైభవ సామ్రాట్ పురస్కారం



•అవార్డు అందజేసిన సినీ నటులు కోట శంకర్ రావు






**వర్ధన్నపేట ప్రతినిధి , 02ఆగస్టు, తరంగాలు** :ప్రముఖ జ్యోతిష్య వాస్తు పురోహితుడు పోలోజు యుగంధర్ శర్మకు పురోహిత జ్యోతిష్య,వాస్తు వైభవ సామ్రాట్ పురస్కారం దక్కింది. ఆదివారం సికింద్రాబాద్ లోని హరిహర కళా భవన్ లో లలిత కళా సమాఖ్య (సామాజిక సేవా సాంస్కృతిక సంస్థ) రుద్రాక్ష వైభవం ఆధ్యాత్మిక పీఠం వారి సంయుక్త ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ సువర్ణ ఘంటా కంకణ అవార్డుల సంబరాలలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో వివిధ రంగాలలో అత్యుత్తమ సేవలు అందిస్తున్న వారికి స్వాతంత్ర్య దినోత్సవ సువర్ణ ఘంటా కంకణ అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటులు కోట శంకర్ రావు,జనార్దన్ రావు (జెన్నీ )లు ముఖ్య అతిదులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా అతిదుల చేతుల మీదుగా యుగంధర్ శర్మ పురోహిత జ్యోతిష్య,వాస్తు వైభవ సామ్రాట్ అవార్డును అందుకున్నారు. అనంతరం శర్మ మాట్లాడుతూ ఆధ్యాత్మిక,వాస్తు, జ్యోతిష్యం పురోహిత విభాగాలలో చేస్తున్న సేవలను గుర్తించి తనకు అవార్డును అందజేయడం సంతోషకరంగా ఉందని ఇది తనపై మరింత బాధ్యతను పెంచిందన్నారు.వర్ధన్నపేట పరిసర ప్రాంతాల్లో ఆధ్యాత్మికంగా ప్రజలకు మరిన్ని సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

# కామన్వెల్త్‌లో అదరగొట్టిన భారత్

- అంచనాలకు మించి రాణించిన బాక్సర్లు
- జూడోలో పసిడి వెలుగులు
- సత్తాచాటిన పారా క్రీడాకారులు



గ్లాస్గో : ప్రతిష్టాత్మక కామన్వెల్త్ గేమ్స్‌లో టాప్-5 లక్ష్యంగా బరిలోకి దిగిన భారత్.. అనుకున్నది సాధించింది. గతంతో పోలిస్తే భారత్‌కు పతకాలు లభించే రెజ్లింగ్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ వంటి క్రీడలను ఈసారి తొలగించినా టోర్నీలో ఆడించిన ఆటల్లోనే మన క్రీడాకారులు సత్తాచాటి పతకాల పట్టికలో దేశాన్ని నాలుగో స్థానంలో నిలిపారు. ముఖ్యంగా బాక్సర్లు అంచనాలకు మించి పసిడి పంచ్‌లు విసిరి గ్లాస్గోలో స్వర్ణ చరిత్ర లిఖించగా అథ్లెట్లూ మునుపెన్నడూ లేని రికార్డులను తిరగరాస్తూ పతకాల మోత మోగించారు. బాక్సర్లు, వెయిట్ లిఫ్టర్లు, అథ్లెట్లు మెరవడంతో ఈ టోర్నీలో భారత్ 13 స్వర్ణాలు, 17 రజతాలు, 9 కాంస్యాలతో మొత్తంగా 39 పతకాలు సాధించి నాలుగో స్థానంతో టోర్నీని ముగించింది. ఆస్ట్రేలియా అగ్రస్థానాన ఉండగా ఇంగ్లండ్, కెనడా.. భారత్ కంటే ముందున్నాయి. ఈ క్రీడల తర్వాతి ఎడిషన్ (2030)కు భారత్‌లోని అహ్మదాబాద్ నగరం ఆతిథ్యమివ్వనుంది.

## బాక్సర్ల పసిడి పంట

ఈసారి దేశానికి పసిడి కాంతులు పంచడంలో బాక్సర్లదే హవా. పలు క్యాటగిరీల్లో పదిమంది బాక్సర్లు ఫైనల్స్‌కు అర్హత సాధిస్తే వారిలో ఏకంగా ఏడుగురు పసిడి పంచ్‌లు విసరగా ముగ్గురు రజతాలతో మెరిశారు. ముఖ్యంగా అబ్బాయిలతో పోలిస్తే అమ్మాయిలు దుమ్మురేపారు. ఏడు స్వర్ణాల్లో ఐదుగురు (ప్రీతి పవార్, సాక్షి చౌదరి, ప్రియా ఘంఘాస్, అరుంధతి చౌదరి, జైస్మిన్ లంబోరియా) వారివే కాగా ఇద్దరే అబ్బాయిలు (సచిన్, అంకుశ్) గోల్డ్ గెలిచారు. బాక్సర్ల కంటే ముందు రెజ్లర్లు సత్తాచాటి 8 మెడల్స్ గెలుచుకున్నారు. వీరిలో మీరాబాయి స్వర్ణం సాధించగా జ్ఞానేశ్వరి, హర్జిందర్, రిషికంఠ, అజయ్ బాబు, లవ్‌ప్రీత్ రజతాలతో మెరిశారు.

## జుడోకాల స్వర్ణ చరిత్ర

ఈ క్రీడల చరిత్రలో స్వర్ణం గెలువని జుడోకాలు ఈసారి అ'ద్వితీయ' ప్రదర్శనతో రెండు గోల్డ్ మెడల్స్ సాధించారు. డోపింగ్ తంటాలు, లగేజీ సమస్యలతో సతమతమైనా యువ జుడోకాలు అస్మిత, హర్ష్ సింగ్ గోల్డ్ మెడల్స్‌తో కొత్త చరిత్ర సృష్టించారు. యామిని రజతంతో మెరవగా ఉన్నతి కాంస్యంతో సరిపెట్టుకుంది.

## అథ్లెట్ల జోరు

అథ్లెటిక్స్‌లో భారత్ ఈసారి 9 పతకాలు గెలుచుకుంది. పదివేల మీటర్ల పరుగు పందెంలో గుల్వీర్ సింగ్ దేశానికి తొలిసారి (రజతం) పతకం అందించగా అతడే.. 5వేల మీటర్ల రేసులోనూ కాంస్యం గెలిచి సీడబ్ల్యూజీలో రెండు మెడల్స్ గెలిచిన ఫస్ట్ ట్రాక్ అథ్లెట్(భారత్)గా రికార్డులకెక్కాడు. తేజస్వినీ శంకర్ డెకథ్లాన్‌లో దేశానికి తొలి పతకాన్ని తీసుకొచ్చాడు. జావెలిన్ త్రో అంటేనే దేశానికి గుర్తొచ్చే నీరజ్ చోప్రాతో పాటు భారత్‌లో కొత్త అథ్లెట్ దూసుకొచ్చాడు. యశ్వీర్ సింగ్ కాంస్యం గెలిచి భవిష్యత్ ఆశాకిరణంలా కనబడుతున్నాడు. పారా అథ్లెట్ల విషయానికొస్తే షాట్‌పుటర్ షర్మిల ధనకర్ (ఎఫ్57) పారా క్రీడల్లో తొలి స్వర్ణాన్ని దేశానికి అందించింది. ఇక పురుషుల వంద మీటర్ల టీ47 ఈవెంట్‌లో దిలీప్ గవిత్.. 10.71 సెకన్లలో లక్ష్యాన్ని పూర్తిచేసి సీడబ్ల్యూజీలో కొత్త రికార్డు నెలకొల్పాడు.

## ఆఖరి రోజు పతకాల్లేకుండానే..

ఆటల ఆఖరి రోజైన ఆదివారం భారత్‌కు పతకాలేమీ రాలేదు. జూడోలో భారత్ ఆశలు పెట్టుకున్న ఇష్రూప్ (మహిళల 78 కిలోలు).. బ్రాంజ్ మెడల్‌కు అర్హత సాధించినా ఆ పోరులో నెగ్గలేకపోయింది. పురుషుల 100 కిలోల విభాగంలో అవతార్ సింగ్, యశ్ ఘంఘాస్ రౌండ్ ఆఫ్-16లోనే ఇంటిబాట పట్టారు. ట్రాక్ సైక్లింగ్‌లో భాగంగా మెన్స్ 1000 మీటర్ల టైమ్ ట్రయల్‌లో రొనాల్డోతో పాటు పారా సైకిలిస్ట్ లిషా దాస్ సైతం నిరాశపరిచారు.

(సంపాదకీయం)

# తెరల వ్యసనం విద్యకు ముప్పు

- చదువుకంటే చేతిలోనే ఎక్కువ సమయం
- మానసిక, శారీరక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- కుటుంబం, పాఠశాల, ప్రభుత్వాల ఉమ్మడి బాధ్యత
- డిజిటల్ వినియోగానికి కచ్చితమైన హద్దులు అవసరం



**డెస్క్, ఆగస్టు 2 02ఆగస్టు, తరంగాలు (ప్రతినిధి):**

నేటి ప్రపంచం డిజిటల్ యుగంలో వేగంగా ముందుకు సాగుతోంది. స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్లెట్లు, ల్యాప్‌టాప్‌లు, ఇంటర్నెట్ విద్యార్థుల నిత్యజీవితంలో భాగమయ్యాయి. ఒకప్పుడు పాఠ్యపుస్తకాలు, గ్రంథాలయాలు, ఉపాధ్యాయులే జ్ఞానానికి ప్రధాన వనరులు కాగా, ఇప్పుడు సమాచారమంతా అరచేతిలోకి వచ్చేసింది. సాంకేతికత విద్యను సులభతరం చేసినా, అదే సాంకేతికత నియంత్రణ లేకుండా వినియోగిస్తే విద్యార్థులను వ్యసనానికి గురిచేస్తోంది. చదువు కోసం మొదలైన తెరల వినియోగం క్రమంగా వినోదం, సామాజిక మాధ్యమాలు, ఆటలు, అంతులేని వీడియోల వీక్షణగా మారుతోంది. ఈ పరిస్థితి విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అందుకే విద్యార్థుల్లో పెరుగుతున్న తెరల వ్యసనం ఇప్పుడు సమాజం మొత్తం ఆలోచించాల్సిన ప్రధాన సమస్యగా మారింది. కొన్ని సంవత్సరాల క్రితం వరకు మొబైల్ ఫోన్ అనేది పెద్దల అవసరంగా ఉండేది. కానీ ఇప్పుడు చిన్నపిల్లల చేతుల్లో కూడా ఖరీదైన స్మార్ట్‌ఫోన్లు కనిపిస్తున్నాయి. పిల్లలు ఏడిస్తే ఫోన్ ఇవ్వడం, తినిపించడానికి వీడియోలు చూపించడం, ఇంట్లో ప్రశాంతంగా ఉండేందుకు గంటల తరబడి మొబైల్ చేతికి ఇవ్వడం సాధారణమైపోయింది. చిన్న వయసులోనే తెరలకు అలవాటు పడిన పిల్లలు క్రమంగా వాటిపైనే ఆధారపడే పరిస్థితి ఏర్పడుతోంది. ఇది వయసు పెరిగే కొద్దీ తీవ్రమైన వ్యసనంగా మారుతోంది. మొబైల్ లేకపోతే అసహనం, చిరాకు, ఆందోళన, కోపం వంటి లక్షణాలు కనిపించడం ఆందోళనకర పరిణామం.

విద్యార్థుల చదువుపై ఈ వ్యసనం తీవ్ర ప్రభావం చూపుతోంది. తరగతి గదిలో ఉన్నప్పటికీ మనసు మొబైల్‌లోనే ఉండే పరిస్థితి ఏర్పడుతోంది. ఇంటికి వచ్చిన తర్వాత చదువుకంటే ముందుగా సామాజిక మాధ్యమాలు, వీడియోలు, ఆన్‌లైన్ ఆటలకే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు. ఫలితంగా పాఠాలపై ఏకాగ్రత తగ్గిపోతోంది. జ్ఞాపకశక్తి మందగించడం, పరీక్షల్లో తక్కువ మార్కులు రావడం, సృజనాత్మక ఆలోచనలు తగ్గిపోవడం వంటి సమస్యలు పెరుగుతున్నాయి. చదువుపై ఆసక్తి తగ్గడం వల్ల కొందరు విద్యార్థులు చదువును మధ్యలోనే వదిలివేసే పరిస్థితులు కూడా ఏర్పడుతున్నాయి. తెరల వ్యసనం కేవలం చదువుకే పరిమితం కాదు. ఇది విద్యార్థుల శారీరక ఆరోగ్యాన్ని కూడా దెబ్బతీస్తోంది. గంటల తరబడి మొబైల్ తెరను చూడడం వల్ల కంటి చూపు మందగించడం, కళ్లలో మంట, తలనొప్పి, మెడ నొప్పి, వెన్నునొప్పి వంటి సమస్యలు పెరుగుతున్నాయి. ఎక్కువసేపు ఒకేచోట కూర్చోవడం వల్ల శారీరక వ్యాయామం తగ్గిపోతోంది. ఊబకాయం, మధుమేహం వంటి జీవనశైలి వ్యాధులు చిన్న వయసులోనే కనిపిస్తున్నాయి. ఆటస్థలాల్లో గడపాల్సిన సమయం ఇప్పుడు తెరల ముందే గడిచిపోతోంది. ఇది భవిష్యత్తులో మరిన్ని ఆరోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదం ఉంది.మానసిక ఆరోగ్యంపై కూడా తెరల వ్యసనం తీవ్ర ప్రభావం చూపుతోంది. రాత్రిళు ఆలస్యంగా మొబైల్ వినియోగించడం వల్ల నిద్ర సమయం తగ్గిపోతోంది. సరైన నిద్ర లేకపోవడం వల్ల అలసట, చిరాకు, మానసిక ఒత్తిడి, నిరాశ వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. సామాజిక మాధ్యమాల్లో ఇతరుల జీవితాలను చూసి తమ జీవితాలతో పోల్చుకోవడం వల్ల ఆత్మవిశ్వాసం దెబ్బతింటోంది. ఆన్‌లైన్ ప్రశంసల కోసం ఎక్కువగా ప్రయత్నించడం, విమర్శలను తట్టుకోలేకపోవడం వంటి మానసిక సమస్యలు కూడా పెరుగుతున్నాయి. నిపుణులు దీనిని ఒక కొత్త తరహా సామాజిక సవాలుగా పేర్కొంటున్నారు. ఈ పరిస్థితికి పూర్తిగా విద్యార్థులనే బాధ్యులను చేయడం సరైంది కాదు. కుటుంబ వాతావరణం కూడా ఇందులో కీలక పాత్ర పోషిస్తోంది. పిల్లలతో మాట్లాడే సమయం తగ్గిపోవడం, ప్రతి అవసరానికీ మొబైల్‌ను ఆశ్రయించడం, పెద్దలు కూడా ఎక్కువసేపు ఫోన్లలోనే గడపడం వల్ల పిల్లలు అదే అలవాటును అనుసరిస్తున్నారు. తల్లిదండ్రులు పిల్లలతో కలిసి భోజనం చేయడం, కథలు చెప్పడం, పుస్తకాలు చదివించడం, బయటకు తీసుకెళ్లడం వంటి అలవాట్లు తగ్గిపోతున్నాయి. పిల్లలకు సమయం ఇవ్వకుండా పరికరాలు ఇవ్వడం తాత్కాలిక పరిష్కారం మాత్రమే కానీ దీర్ఘకాలంలో అది పెద్ద సమస్యగా మారుతోంది.

పాఠశాలలు, కళాశాలలు కూడా ఈ సమస్యను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలి. డిజిటల్ పరికరాల ఉపయోగం గురించి మాత్రమే కాకుండా వాటి దుష్ప్రభావాలపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించాలి. పాఠశాలల్లో క్రీడలు, యోగా, ధ్యానం, గ్రంథాలయ వినియోగం, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యం పెంచాలి. విద్యార్థులను ప్రత్యక్ష చర్చలు, బృంద కార్యక్రమాలు, ప్రకృతి విహారాలు వంటి వాటిలో పాల్గొనేలా ప్రోత్సహించాలి. పాఠశాల స్థాయిలో మానసిక ఆరోగ్య నిపుణుల సేవలు అందుబాటులో ఉండేలా చూడాలి. ప్రభుత్వాలు కూడా ఈ అంశాన్ని ప్రజారోగ్య సమస్యగా పరిగణించాల్సిన అవసరం ఉంది. పిల్లలకు అనుచితమైన సమాచారాన్ని నియంత్రించడం, ఆన్‌లైన్ ఆటలపై పర్యవేక్షణ పెంచడం, డిజిటల్ వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వంటి చర్యలు చేపట్టాలి. తల్లిదండ్రులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి పిల్లల మొబైల్ వినియోగాన్ని ఎలా నియంత్రించాలో వివరించాలి. విద్యా విధానాల్లో కూడా డిజిటల్ క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి. సమాజంలో ప్రతి ఒక్కరూ ఈ సమస్యను సీరియస్‌గా తీసుకున్నప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయి.సాంకేతికతను పూర్తిగా దూరం చేయడం సాధ్యం కాదు, అవసరం కూడా కాదు. కానీ దాని వినియోగానికి స్పష్టమైన పరిమితులు ఉండాలి. రోజులో ఎంతసేపు మొబైల్ ఉపయోగించాలి, చదువుకు ఎంత సమయం కేటాయించాలి, ఆటలకు ఎంత సమయం ఇవ్వాలి అనే విషయాల్లో పిల్లలకు చిన్నప్పటి నుంచే క్రమశిక్షణ నేర్పాలి. కుటుంబ సభ్యులు కూడా తెరల వినియోగంలో ఆదర్శంగా నిలవాలి. వారంలో కొంత సమయం మొబైల్, టెలివిజన్‌కు దూరంగా కుటుంబంతో గడిపే అలవాటును పెంపొందించాలి. ఇది పిల్లల్లో సామాజిక సంబంధాలను బలోపేతం చేస్తుంది. విద్యార్థులు దేశ భవిష్యత్తు. వారి చేతుల్లో పుస్తకం ఉండాల్సిన సమయంలో మొబైల్ శాశ్వత సహచరంగా మారితే అది వ్యక్తిగత నష్టమే కాదు, దేశానికి కూడా నష్టమే. సాంకేతికతను జ్ఞాన సాధనంగా ఉపయోగించాలి గానీ జీవితాన్ని నియంత్రించే వ్యసనంగా మార్చకూడదు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వాలు, సమాజం, విద్యార్థులు అందరూ కలిసి డిజిటల్ వినియోగంలో సమతుల్యత పాటించినప్పుడే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. భావితరాన్ని ఆరోగ్యవంతంగా, విజ్ఞానవంతంగా తీర్చిదిద్దాలంటే తెరలపై నియంత్రణ, జీవితంపై బాధ్యత అనే రెండు విలువలను సమానంగా అలవరచుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.